శుక్రవారం
10-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 139
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వచ్చే ఏడాదికి 500 వందే భారత్ రైళ్లు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాదికి 500 వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం భారతీయ రైల్వే సన్నాహాలు చేస్తోందని చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ బీజీ మాల్యా వెల్లడించారు. ఈ ఏడాది 75 వందే భారత్ రైళ్లను పట్టాలు ఎక్కించాలని భావించినట్లు చెప్పారు. అందులో ఎనిమిది కార్ వెర్షన్‌వి 63.. 16 కార్ వెర్షన్‌వి 13 ఉన్నాయన్నారు. రైలు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికులకు గాయాల బారిన పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు మాల్యా తెలిపారు. దశలవారీగా 25 రైళ్లను ప్రారంభించిన రైల్వే శాఖ.. తాజాగా ఒకేసారి తొమ్మిది రైళ్లను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో కాచిగూడ-యశ్వంత్‌పూర్, విజయవాడ-చెన్నై రైళ్లు ఉన్నాయి.

మహువా బహిష్కరణకు రంగం సిద్ధం

- నివేదికను ఆమోదించిన లోక్‌సభ నైతిక విలువల కమిటీ
- నేడు స్పీకర్ ముందుకు నివేదిక
- కక్ష సాధింపు అంటున్న విపక్షాలు

2లో

బీజేపీ కక్ష సాధింపు రాజకీయాలు నిస్సిగ్గుగా కొనసాగుతున్నాయి. ప్రధాని మోదీ అనుంగు మిత్రుడు, పారిశ్రామికవేత్త అదానీ టార్గెట్‌గా విమర్శలు చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాను లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. ఆమెను ఎంపీ పదవి నుంచే తప్పించాలని కుట్ర చేస్తోంది.

రిజర్వేషన్లు 65 శాతానికి పెంపు

బిల్లులకు బీహార్ అసెంబ్లీ ఆమోదం

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అత్యంత వెనుకబడిన తరగతులు, ఇతర వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతం పెంచుతూ నితీశ్‌కుమార్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను బీహార్ అసెంబ్లీ గురువారం ఆమోదించింది.

2లో

కక్ష కట్టిన కాషాయం

- ఎన్నికల వేళ విపక్ష నేతలపై 'దర్యాప్తు' అస్త్రాల జోరు
- ఈడీ, సీబీఐ, ఐటీతో ప్రభుత్వాధికారులకు సయోధ్య

న్యూఢిల్లీ: ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీ నాయకులపై దర్యాప్తు అస్త్రాల పదును పెరిగింది. తనిఖీలు, దాడులు ముమ్మరమయ్యాయి. సీబీఐ, ఈడీ, ఐటీ దాడుల గతి పెరిగింది. ఎన్నికలకు తమ అభ్యర్థులను పార్టీలు సిద్ధం చేసుకునే సమయంలో దర్యాప్తు అధికారులతో దాడులు చేయించడం ద్వారా ప్రత్యర్థుల మనోధైర్యాన్ని దెబ్బతీసి ఓట్లు దండుకోవాలన్న వ్యూహాన్ని కేంద్రప్రభుత్వం అనుసరిస్తోంది. చేపట్టే ఆపరేషన్లలో దర్యాప్తు సంస్థల అధికారులకు, ప్రభుత్వ అధికారులకు అన్ని స్థాయిల్లో సమన్వయం ఉంటోంది. సంస్థాగత సయోధ్య ఉండటం వల్ల ప్రతిపక్ష పార్టీల నాయకులు టార్గెట్ అవుతున్నారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీపై దర్యాప్తు సంస్థలు విరుచుకుపడ్డాయి. 'ఇండియా' కూటమిలోని ప్రతిపక్ష పార్టీ సీనియర్లు, మంత్రులు జైల్లో ఉన్నారు లేక ఈడీ నిఘాలో ఉన్నారు. ఈ జాబితాలో ఢిల్లీ ఆప్ టాప్‌లో ఉంది. ఆ పార్టీ ముగ్గురు మంత్రులు ఇప్పటికే జైల్లో ఉండగా నాల్గో మంత్రిపై చర్యలు మొదలయ్యాయి. పశ్చిమ బెంగాల్ కూడా అమిత్‌షా హిట్‌లిస్ట్‌లో ఉంది. ఇప్పటికే జ్యోతిప్రియ మల్లిక్‌తో పాటు కొందరు నేతలు అరెస్టు అయ్యారు. ఇదే కొనసాగితే మమతా బెనర్జీ తన కేబినెట్ సమావేశాన్ని జైల్లో పెట్టుకోవాలని బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్ విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కుమార్తె కె.కవిత, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ కుమారుడు రతుల్ పూరి విచారణ ఎదుర్కొంటున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ఈడీ, సీబీఐ, ఐటీ, ఢిల్లీ పోలీసుల విచారణ నిత్యకృత్యమైంది. ప్రస్తుతం రాజస్తాన్, ఢిల్లీపై ఈడీ, సీబీఐ, ఐటీ దృష్టి కేంద్రీకరించాయి. ఇప్పటివరకు తొమ్మిది మంది నేతలపై కేసులు ఉన్నాయి. అశోక్ గెహ్లాత్ తనయుడు, సోదరుడు, మంత్రులు, సీనియర్ కాంగ్రెస్ నేతలు దర్యాప్తు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ రాజస్తాన్ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోత్సరా, ఓం ప్రకాశ్ హుడా,

- మిగతా 2 లో

ఇకపై ఉమ్మడి కార్యాచరణ

- 13న ఎన్నికల మేనిఫెస్టో కమిటీ భేటీ
- 14-16 తేదీల్లో నియోజకవర్గాల్లో సమావేశాలు
- 17 నుంచి ఉమ్మడిగా భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం
- టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ సమావేశం నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇకపై ప్రతి అంశంలోనూ టీడీపీ, జనసేన అధ్వర్యాన ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని సమన్వయ కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14, 15, 16 తేదీల్లో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశాలు నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. దీనికి ముందుగా 13వ తేదీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ భేటీ కావాలని,మరికొన్ని అంశాలను అందులో పొందుపర్చాలని, 17వ తేదీ నుంచి ఉమ్మడిగా భవిష్యత్తుపై గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. విజయవాడలోని నోవాటెల్ లో టీడీపీ- జనసేన సమన్వయ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తో పాటు రెండు పార్టీల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సుమారు మూడు గంటలపాటు భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం భేటీ వివరాలను నారా లోకేశ్, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమక్షంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మీడియాకు వివరించారు. గత నెల 23న టీడీపీ - జనసేన సమన్వయ సమావేశం రాజమహేంద్రవరంలో నిర్వహించామని, ఇది రెండో సమావేశం అన్నారు. దాదాపు మూడు గంటలపాటు అన్ని విషయాలపై చర్చించాం. హోటల్ లో జరిగే చివరి సమావేశం ఇదే. ఇక నుండి ప్రతి 15 రోజులకొక సమావేశం జరుగుతుంది. వచ్చే సమావేశాన్ని జనసేన కార్యాలయంలో, తర్వాత టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు టీడీపీ - జనసేన కలిసి పనిచేయాలని నిర్ణయించామన్నారు. చంద్రబాబు నాయుడుకు పూర్తిస్థాయి బెయిల్ వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బహిరంగసభల్లో

- మిగతా 2 లో



30 వరకు చంద్రబాబును అరెస్ట్ చేయొద్దు

- ఫైబర్ నెట్ కేసుపై అదే రోజు విచారణ
- స్కిల్‌పై దీపావళి తర్వాత తీర్పు వెల్లడిస్తామన్న సుప్రీం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఫైబర్ నెట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈనెల 30వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు ఈ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయవద్దని సీఐడీని ఆదేశించింది. అలాగే ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో దీపావళి పండుగ తర్వాత తీర్పు వెల్లడిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఫైబర్

- మిగతా 2 లో

పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

- 'వేదాద్రి' దగ్గరున్నా నీరు అందకపోవడం విచారకరం
- నష్టపరిహారం కోసం 20,21 తేదీల్లో విజయవాడలో 30 గంటల దీక్ష
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-నందిగామ రూరల్: తీవ్ర వర్షాభావం వలన వానలు లేక ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గ ప్రాంతంలో నీరందక దెబ్బతిన్న, ఎండిపోయిన పత్తి పొలాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ బృందం పరిశీలించి రైతులతో మాట్లాడారు. గురువారం మునగచర్ల, అనసాగరం గ్రామాలలో వేదాద్రి ఎత్తిపోతల పరిసర ప్రాంతాలలోని పొలాలను పరిశీలించారు. రైతు నాగేశ్వరరావుకు చెందిన పత్తి చేలను సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వేదాద్రి ఎత్తిపోతల పథకం అందుబాటులో ఉన్న పరిసర ప్రాంత రైతాంగానికి నీరు అందించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. నెల రోజులకు పైగా నీరు లేదని ఒకపక్క వర్షాభావంతో జిల్లాలో 14 కరువు మండలాలు ఉంటే రెండు మండలాలనే ప్రకటించడం దారుణమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కరువు వల్ల దెబ్బతిన్న పంటలకు పంటల బీమా కల్పించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20,21 తేదీలలో విజయవాడలో కరువు దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ చుండూరు వెంకట సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లంక దుర్గారావు, సమితి సభ్యులు కొట్టు రమణ, తాడిపైడియ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, పట్టణ కార్యదర్శి వేముల వీరయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సాంబశివరావు ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు జిల్లేపల్లి తుఫాన్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 4 నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 4 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ప్రకటించారు. 19 రోజుల్లో 15 సిట్టింగ్‌లు ఉంటాయని ఆయన ఎక్స్ మాధ్యమంగా వెల్లడించారు. శీతాకాల సమావేశాల్లో అనేక అంశాలపై చర్చలు జరుగుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రా వ్యవహారంలో ఎథిక్స్ కమిటీ నివేదికను లోక్‌సభలో ప్రవేశ పెట్టనున్నారు. ప్యానల్ సూచించినట్లు ఎంపీని తొలగించడానికి ముందే ఈ నివేదికను సభ ఆమోదించాలి. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఆధారాల చట్టం స్థానంలో ప్రవేశపెట్టే కీలక బిల్లుపై చర్చ జరగనుంది. మూడు నివేదికలను హోంశాఖ స్థాయి సంఘం ఇటీవల ఆమోదించింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉండగా దీనికి ఈసారి సభ ఆమోదం లభించే అవకాశం లేకపోలేదు.

విద్యార్థులకు 'పరీక్ష'

- ఎస్‌ఏ-1 వాయిదా
- పాఠశాల విద్యశాఖ లోపం
- ఉపాధ్యాయులకు బోధనేతర పనులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమపద్ధతిలో పరీక్షలు నిర్వహించడం లేదు. తాజాగా సమ్మేటివ్ ఎస్సెస్‌మెంట్ (ఎస్ఏ)-1 పరీక్షలను ఈ నెల 28వ తేదీకి మార్చడం ఇందుకు నిదర్శనం. పండుగలు, ఇతరత్రా కార్యక్రమాల సాకుతో ఎస్‌ఏ-1 పరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసి విమర్శలపాలైంది. ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జగన్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఆ దిశగా కొంత వరకు సఫలీకృతమైంది. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల నుంచి విద్యార్థులకు ఏకరూప దుస్తులు కల్పించింది. మనబడి నాడు-నేడు కింద పాఠశాలలను ఆధునీకరించి, ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టి మొత్తంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అదేసమయంలో విద్యార్థుల చదువుకు కీలకమైన, కొలబద్ధంగా నిలిచే పరీక్షల విధానంపై సమర్థవంత చర్యలు తీసుకోలేకపోతోంది. ఇది ప్రభుత్వ పరిశీలనలో లోపమా? లేక విద్యాశాఖ వైఫల్యమా? అనేది తెలియడం లేదు. గతంలో దసరా నాటికి మూడు నెలల పరీక్ష (క్వార్టర్లీ), సంక్రాంతికి అర్ధసంవత్సరం, ఏప్రిల్‌కు వార్షిక పరీక్షలు నిర్వహించడం ఆనవాయితీ. క్రమేపీ ఆ పరీక్షలు కాస్తా ఎస్‌ఏ-1, 2, 3గా విద్యాశాఖ అమలు చేస్తోంది. ఆ మూడు పరీక్షలు కాస్తా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అదే...వై!?

ప్రజా ప్రతినిధులపై కేసుల విచారణకు ప్రత్యేక ధర్మాసనాలు

హైకోర్టులకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేయాలని హైకోర్టులను సుప్రీం కోర్టు ఆదేశించింది. ప్రజా ప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణలను వేగంగా పూర్తి చేసేందుకు కచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేయడం క్లిష్టమైన ప్రక్రియని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ట్రయల్ కోర్టులు అత్యవసరమైతే తప్ప ప్రజా ప్రతినిధులపై నమోదైన కేసుల విచారణలు వాయిదా వేయకూడదని పేర్కొంది. చట్టసభ్యులపై ఐదు వేలకుపైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వీటి వేగవంత విచారణకు ప్రత్యేక ధర్మాసనం ఉండాలని నొక్కిచెప్పింది. అసాధారణ కారణాలతో ఈ కేసుల విచారణను వాయిదా వేయొద్దని ప్రత్యేక న్యాయస్థానాలకు సూచించింది. ఈ మేరకు హైకోర్టులు, జిల్లా జడ్జిలు, ప్రత్యేక కోర్టులకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

- మిగతా 2 లో

శిబిరాలు, ఆసుపత్రులే లక్ష్యం

- 'అల్ షిఫా' వైపుకు కదులుతున్న ఇజ్రాయిల్ సైన్యం
- గాజాకు మానవతా సాయంపై 80 దేశాల సమన్వయం
- 56 ఏళ్లలోనే ప్రమాదకర స్థితి ఐరాస హక్కుల కమిషనర్

2లో

మారణహోమం ఆపండి

ఇజ్రాయిల్‌లోని 35 యూదు, అరబ్ హక్కుల సంఘాల పిలుపు

టెల్‌అవీవ్/న్యూయార్క్: గాజాలో మారణహోమాన్ని ఆపాలని 35 ఇజ్రాయిలీ యూదులు, అరబ్ శాంతి- మానవహక్కుల సంఘాలు డిమాండ్ చేశాయి. తక్షణమే కాల్పుల విరమణ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయిలీలను విడిపించాలని, రాజకీయ-దౌత్యపరమైన పరిష్కారం కోసం కసరత్తు చేయాలని మతోన్మాద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. వెస్ట్‌బ్యాంక్‌లో హింసకు ముగింపు పలకాలని హక్కుల సంఘాలు ఉమ్మడి ప్రకటన చేశాయి. 'అక్టోబరు 7న హమాస్ చేసిన దాడి యూదులు, అరబ్‌లను షాక్‌కు గురిచేసింది. ఆ తర్వాత పరిస్థితి మరీ దారుణంగా మారింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. మారణహోమం ఆగడంలేదు. గాజాలో ఇజ్రాయిల్ దళాలు బాంబులు కురిపిస్తూనే ఉన్నాయి. తాగునీరు, ఆహారం, విద్యుత్ సరఫరా లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. అమాయక పిల్లలు, మహిళలు, వృద్ధులు మృత్యువాత పడుతున్నారు. లక్షల మంది నిర్వాసితులయ్యారు. సర్వం కోల్పోయారు. అమాయకులను హింసించడం, వేధించడం, చంపేయడం ద్వారా సమస్య తీవ్రతరం అవుతుందేగానీ పరిష్కారం కాబోదు. ఈ ఘర్షణకు సైనికపరంగా పరిష్కారం లభించదని ఇప్పటికే అనేకమార్లు రుజువు అయింది. రాజకీయ ఒప్పందం జరిగితే తప్ప ఈ రక్తపాతానికి అంతం ఉండదు. రాజీ కుదిరినప్పుడే రెండు దేశాలకు భద్రత, న్యాయం, స్వేచ్ఛకు హామీ లభిస్తుంది. శాంతి నెలకొనప్పుడు మాత్రమే భద్రత-రక్షణ లభించగలదు' అని హక్కుల సంఘాలు పేర్కొన్నాయి.

కాల్పుల విరమణకు న్యూయార్క్ ప్రజల డిమాండ్

గాజాలో కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తూ పలస్తీనా జెండాలు చేబూని న్యూయార్క్ ప్రజలు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. 'పలస్తీనాకు స్వేచ్ఛ', 'తక్షణమే కాల్పుల విరమణ అమలు', 'మారణహోమం ఆపండి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. నగరవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'నెతన్యాహు, బైడెన్ యుద్ధ నేరస్తులు, ఇజ్రాయిల్ ఉగ్రవాద దేశం... యద్ధేచ్ఛగా మారణహోమం సృష్టిస్తోంది' అన్న బ్యానర్లనూ నిరసనకారులు ప్రదర్శించారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి కేంద్ర కార్యాలయం మీదగా 42వ వీధి గుండా మ్యాన్‌హాటన్ వరకు ప్రదర్శన సాగింది. పోలీసు బందోబస్తు మధ్య పలస్తీనా సంఘీభావ ప్రదర్శన జరిగింది. అవాంఛనీయ ఘటనలుగానీ అరెస్టులుగానీ జరిగిన దాఖలాలు లేవు.

మృత్యు రవాణాను అడ్డుకోవాలి

గ్రీస్-ఇటలీ-టర్కీ రవాణా కార్మిక సంఘాల ఉమ్మడి పిలుపు

పలస్తీనా ప్రజల మారణహోమాన్ని తక్షణమే ఆపాలని గ్రీస్-ఇటలీ-టర్కీ రవాణా కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రజల అణచివేత, దురాక్రమణ, వివక్ష, ఫాసిజాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. ఎల్లప్పుడు శాంతి పక్షాన్నే నిలుస్తామని స్పష్టంచేశాయి. యూరప్‌లోని నౌకాశయాలు, విమానాశయాలు, నౌకలు, రైళ్లను మృత్యువుకు రవాణా కేంద్రాలుగా మార్చడాన్ని సహించబోమని తేల్చిచెప్పాయి. నౌకలు, విమానాలు తదితరాల ద్వారా ఆయుధాలు సరఫరా చేస్తూ లాజిస్టిక్ సేవలు అందిస్తూ దాడులకు సహకరించడాన్ని ఉపేక్షించేది లేదని ప్రభుత్వాలకు తేల్చిచెప్పాయి. ప్రతిరోజు వేలాది మంది అమాయక ప్రజలు ముఖ్యంగా పిల్లలు, మహిళల ప్రాణాలు హరించే వ్యవస్థను పెంచిపోషించేందుకు ఎంత మాత్రం అంగీకరించబోమని వెల్లడించాయి. పలస్తీనా ప్రజలు, కార్మికుల ఫిర్యాదులకు స్పందించిన ఇటలీ, గ్రీస్, టర్కీ రవాణా కార్మికుల ప్రతినిధులు, కార్మిక సంఘాలు ... పలస్తీనా ప్రజల మారణహోమానికి దోహదమయ్యే ఆయుధాలు, యుద్ధ సామాగ్రి రవాణాను అడ్డుకోవాలని ఉమ్మడిగా నిర్ణయించాయి. యూరప్ రవాణా కార్మికుల శాంతి సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సంయుక్త నిర్ణయం మరో ముందడుగని ప్రకటన తెలిపింది. గాజాలో మారణహోమాన్ని ముగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు పోరాటం చేసేందుకు అగ్రభాగాన నిలుస్తామని కార్మిక సంఘాలు వెల్లడించాయి. పలస్తీనా ప్రజల ఊచకోతకు సాయం చేయొద్దని, ఆయుధ సరఫరాను తక్షణమే నిలిపివేయాలని ఆయా ప్రభుత్వాలను డిమాండ్ చేశాయి. పలస్తీనా విమోచనానికి, శాంతికి పిలుపునిచ్చాయి. తమ పోరాటంలో కలిసి రావాలని యూరప్‌లోని నౌకాశయాలు, విమానాశ్రయాలు, రైల్వే, రవాణా కార్మికులకు ఇటలీ, యూఎస్‌బీ ట్రాన్స్‌పోర్ట్, ఎనేడెప్-కాస్కో డాక్టర్స్ యూనియన్, గ్రీస్, స్టెఫెన్‌సన్, పెమెన్, పీమేజ్ మారిటైమ్ యూనియన్లు, గ్రీస్, టర్కీలోని నక్లియాత్ పిలుపునిచ్చాయి.

రిజర్వేషన్లు 65 శాతానికి పెంపు

పాట్నా: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అత్యంత వెనుకబడిన తరగతులు, ఇతర వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతం పెంచుతూ నితీశ్‌కుమార్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను బీహార్ అసెంబ్లీ గురువారం ఆమోదించింది. ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఓబీసీలకు రిజర్వేషన్లు పెంచాలని నితీశ్‌కుమార్ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లులను అసెంబ్లీలో ప్రతిపాదించింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాలకు ఇవే రిజర్వేషన్లు వర్తించేలా బిల్లులు రూపొందించింది. నితీశ్‌కుమార్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులసర్వే ఆధారంగా రిజర్వేషన్లు పెంచింది.

ఈ బిల్లులకు అసెంబ్లీ మూజువాణి ఓటుతో ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుల ప్రకారం ఎస్టీల కోటా రెట్టింపు అంటే ఒకటి నుంచి రెండు శాతానికి పెరుగుతుంది. ఎస్సీల రిజర్వేషన్లు 16 శాతం నుంచి 20 శాతానికి పెరిగింది. ఈబీసీలకు సంబంధించి ఇప్పటి వరకు అమలవుతున్న 18శాతం రిజర్వేషన్లు 25 శాతానికి, ఓబీసీ రిజర్వేషన్లు 12 శాతం నుంచి 15 శాతానికి పెరుగుతాయి.

30 వరకు చంద్రబాబును అరెస్ట్ చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

నెట్ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్ గురువారం సుప్రీం ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. కోర్ట్ నంబర్ 6లో ఐటమ్ నంబర్ 11గా జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం ముందు విచారణ జరిగింది. నవంబర్ 30న ఈ కేసు విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. అప్పటి వరకు ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయొద్దని స్పష్టం చేసింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో పాత ఆర్డర్ ప్రకారం దీపావళి సెలవుల తర్వాత తీర్పు వెలువరిస్తామని పేర్కొంది. తొలుత ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టును ఆశ్రయించగా అక్టోబర్ 9న తిరస్కరించింది. ఫైబర్ కేసులో దర్యాప్తు కీలక దశలో ఉన్నందున బెయిలు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ చంద్రబాబు తరపు న్యాయవాదులు సుప్రీంలో పిటిషన్ వేశారు. ఈనెల 11 నుంచి 19 వరకు సుప్రీంకోర్టుకు దీపావళి సెలవులు ఉన్నాయి. 20న సుప్రీంకోర్టు పున:ప్రారంభం కానుంది. అయితే ముందుగా ఫైబర్ నెట్ కేసు విచారణను 23వ తేదీకి వాయిదా వేయగా... తన కుమారుడి వివాహం కారణంగా వాయిదా వేయమని చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూత్రా సుప్రీంను కోరారు. దీంతో నవంబర్ 30కి ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

ఇకపై ఉమ్మడి కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ప్రసంగిస్తారు. రెండు పార్టీల్లోని అన్ని అనుబంధ విభాగాలు కలిసి ఎక్కడున్నా కలిసి పనిచేస్తాయి. ఉమ్మడి జిల్లాను యూనిట్ గా తీసుకుని ఇటీవల సమావేశాలు నిర్వహించాం. ఇప్పటికే భవిష్యత్ గ్యారంటీ పేరుతో టీడీపీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ మేనిఫెస్టోలో చేర్చాలని కొన్ని అంశాలను ఇచ్చారు... వీటిని కూడా భవిష్యత్ గ్యారంటీలో చేర్చుతాం. రెండు పార్టీల నుండి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేస్తాం. టీడీపీ నుండి యనమల రామకృష్ణుడు నాయకత్వంలో ముగ్గురు సభ్యులు ఉంటారు. మొదట రెండు పార్టీల మేనిఫెస్టో కమిటీలు ఈ నెల 13న సమావేశమవుతాయి. 17 నుండి టీడీపీ - జనసేన భవిష్యత్ గ్యారంటీ ద్వారా ప్రతి ఇంటికీ వెళ్తాయని వారు వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చాలా ఉన్నాయి. ఏపీ చరిత్రలో ఏనాడూ రాని కరువు వచ్చింది. ముఖ్యమంత్రి జగన్ మాత్రం కరువు లేదు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్తున్నారు. దీనిపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించి, రైతుల పక్షాన గట్టిగా పోరాడతాం. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుండి పరిహారం అందేవరకూ రెండు పార్టీలు పోరాడతాయి. బీమాను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. బీమా కంపెనీలకు డబ్బులు కట్టకపోవడంతో రైతులకు బీమా రాలేదు. అందువల్ల ప్రభుత్వమే బీమా పరిహారం అందించాలి. రాష్ట్రంలో రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, ఇసుకలో అక్రమాలను గుర్తించాం. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సంక్షేమాన్ని ఇవ్వడం లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై దమనకాండ సాగుతోంది. అన్ని వర్గాలను చైతన్యం చేసేందుకు సమావేశాలు నిర్వహిస్తాం. ఇందులో మొదటగా బీసీ రౌండ్ టేబుల్ సమావేశాలు పార్లమెంట్ వారీగా నిర్వహిస్తాం. ఇవి పార్టీల సమావేశంలా కాకుండా బీసీ సంఘాలు, సంఘాల పెద్దలను పిలిచి సమస్యలపై చర్చించాలని నిర్ణయం తీసుకున్నాం. అలాగే ఓటర్ లిస్టులో అనేక ఇబ్బందులు ఉన్నాయి. దీనిపైనా రెండు పార్టీలు కలసి పని చేస్తాయి. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీ చిత్తుగా ఓడుతుంది... అందుకే టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. రాష్ట్రానికి పట్టిన శని జగన్‌ను వదిలించడమే టీడీపీ-జనసేన ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు, మనోహర్ స్పష్టం చేశారు.

ప్రత్యేక ధర్మాసనాలు

(మొదటిపేజీ తరువాయి)

జారీచేసింది. పార్లమెంటు సభ్యులు, శాసనసభలు, శాసనమండళ్ల సభ్యులపై క్రిమినల్ కేసులకు ప్రాధ్యానత ఇవ్వాలని ఆదేశించింది. పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులపై పెండింగ్ క్రిమినల్ కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా 'ఇన్ రీ డెసిగ్నేటెడ్ కోర్ట్స్ ఫర్ ఎంపీస్/ఎమ్మెల్యేస్' పేరిట సుమోటో కేసును హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నమోదు చేస్తారని సీజేఐ డీవై చంద్రచూడ్,జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వెల్లడించింది. స్థానిక అంశాల దృష్ట్యా దేశవ్యాప్తంగా ట్రైల్ కోర్టులకు ఒకే తరహా మార్గదర్శకాలు ఇవ్వడం సర్వోన్నత న్యాయస్థానానికి కుదరదంలేదని తెలిపింది. కేసుల వేగవంత విచారణ బాధ్యతను హైకోర్టులకు సుప్రీంకోర్టు అప్పగించింది. కాగా, 2022, నవంబరు 14న అమిస్ క్యూరీ విజయ్ హన్సారియా నివేదికల ప్రకారం 5,175 క్రిమినల్ కేసులు నాయకులపై ఉంటే వీటిలో 2,116 క్రిమినల్ కేసులు ఐదేళ్లకుపైగా పెండింగ్ ఉన్నాయి' అని వెల్లడైంది.

శిబిరాలు, ఆసుపత్రులే లక్ష్యం

జెరూసలేం/జెనీవా/కైరో/వాషింగ్టన్: ఉత్తర గాజాపై ఇజ్రాయిల్ దళాలు గురువారం బాంబుల వర్షం కురిపించాయి. హమాస్ అంతమే లక్ష్యమంటూ శిబిరాలు, ఆసుపత్రులను ఐడీఎఫ్ లక్ష్యంగా చేసుకుంటుండటం స్థానికులను కలవరపాటుకు గురిచేస్తోంది. సురక్షిత ప్రాంతమంటూ ఒక్కటీ లేకపోవడంపై తీవ్రస్థాయిలో భయాందోళనకు గురవుతున్నారు. గాజాలోని అతిపెద్ద ఆసుపత్రి అల్ షిఫాను ఇజ్రాయిలీ దళాలు సమీపిస్తున్నట్లు గాజా పౌరులు తెలిపారు. ఈ ఆసుపత్రిలో హమాస్ కమాండ్ కేంద్రం ఉన్నట్లు ఇజ్రాయిల్ నమ్ముతోంది. ఇజ్రాయిల్ దాడుల క్రమంలో వేలాది మంది పలస్తీనియన్లు అక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ఇదిలావుంటే గాజాలో 10,569 మంది చనిపోగా మృతుల్లో 40శాతం మంది చిన్నారులు ఉన్నట్లు పలస్తీనా అధికారులు తెలిపారు. గాజాలో మానవతా సాయం అందించేందుకు సమన్వయం కోసం 80 దేశాలు, సంఘాల అధికారులు పారిస్‌లో సమావేశమయ్యారు. ఇజ్రాయిల్ దాడుల్లో గాయపడిన వారికి సాయం అందించేందుకు మార్గాలను అన్వేషించే దిశగా చర్చలు జరిపారు. ఈ మారణహోమం నుంచి పౌరులకు ఏ విధంగా రక్షణ కల్పించాలనేది చర్చించారు.

పశ్చిమాసియాలో పరిస్థితి 56 ఏళ్లలోనే అత్యంత ప్రమాదకరంగా ఉందని ఐరాస మానవహక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ వెల్లడించారు. గాజా ప్రజలు పీడకలను జీవిస్తున్నారన్నారు. 56ఏళ్ల దురాక్రమణ చరిత్రలో ఇంతటి ఘోర పరిస్థితి ఎన్నడూ లేదని, ప్రస్తుతం గాజా, ఇజ్రాయిల్, వెస్ట్‌బ్యాంక్ ప్రజలు అనుభవిస్తున్నది మునుపెన్నడూ జరగనిదని టర్క్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్, హమాస్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాయని వెల్లడించారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, బందీలను వెంటనే విడుదల చేయాలని పిలుపునిచ్చారు. 'రఫా సరిహద్దును సందర్శించాను. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాను. రఫా సరిహద్దు... 2.3 మిలియన్ల గాజా ప్రజలకు జీవనరేఖగా మారింది. కానీ ఆ జీవనరేఖ చాలా సన్నగా ఉంది. రఫాలో భయానక పరిస్థితులకు ద్వారాలు కనిపిస్తున్నాయి' అని అన్నారు. తన సహచరులు కొందరు గాజాలో చిక్కుకున్నారని, కుటుంబ సభ్యులను కోల్పోయారని, నిద్రలేని రాత్రిళ్లు గడుపుతున్నారని, తీవ్ర వేదనకు గురవుతున్నారని టర్క్ వెల్లడించారు.

గాజాలో విదేశీ పాలనకు జోర్డాన్ వ్యతిరేకం

గాజాలో పర పాలనను అంగీకరించేది లేదని జోర్డాన్ తేల్చిచెప్పింది. సమీప భవిష్యత్‌లో గాజా స్ట్రిప్‌లో ఇతరులు పాలించే ఆలోచనకు తాము వ్యతిరేకమని జోర్డాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయ్‌మన్ సఫాదీ స్పష్టంచేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పోరు ముగిసిన తర్వాత గాజా పరిపాలన అరబ్‌లు లేక అరబ్‌యేతరుల ద్వారా సాగాలనే దిశగా చర్చలను జోర్డాన్ తిరస్కరిస్తుందని వెల్లడించారు. ఘర్షణ పరిష్కారానికి రాజకీయ సమాధానం, సమగ్ర, న్యాయమైన శాంతి ప్రక్రియ అవసరమని నొక్కిచెప్పారు. పలస్తీనా హక్కులను గుర్తిస్తూ, స్వతంత్ర దేశ సృష్టికి హామీ ఇవ్వడం అనివార్యమన్నారు.

ఇజ్రాయిల్-గాజా పరిస్థితిపై సెనేటర్లతో బైడెన్ చర్చలు

గాజాలో ఘర్షణ నేపథ్య పరిణామాలపై చర్చించేందుకు అరబ్ దేశాలు, ఇజ్రాయిల్‌లో పర్యటించిన సెనేటర్లతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కలిసి పరిస్థితులను సమీక్షించినట్లు శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, ఈజిప్టు దేశాల్లో పర్యటించి తిరిగి వచ్చిన సెనేటర్లతో అధ్యక్షుడు భేటీ అయి ఇజ్రాయిల్, గాజా పరిస్థితిపై చర్చించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. సెనేటర్లు లిండ్‌సే గ్రాహమ్, బెన్ కార్డిన్, రిచర్డ్ బ్లూమెంథల్, కోరి బూకర్, క్యాటీ బ్రిట్, సూజాన్ కొలిన్స్, క్రిస్ కూన్స్, జాక్ రీడ్, డాన్ సుల్లివన్‌లు బైడెన్‌తో సమావేశమైన వారిలో ఉన్నట్లు పేర్కొంది.

ఇజ్రాయిల్-పలస్తీనాకు కొత్త నాయకత్వం అవశ్యం: హిల్లరీ క్లింటన్

శాంతి ప్రక్రియకు పునర్జీవనం లభించే వాతావరణాన్ని సృష్టించడం, రెండు దేశాల పరిష్కారాన్ని అమలు చేసే దిశగా కసరత్తుకుగాను ఇజ్రాయిల్, పలస్తీనాలో కొత్త నాయకత్వం ఏర్పాటు కావడం అవసరమని అమెరికా మాజీ కార్యదర్శి హిల్లరీ క్లింటన్ గురువారం అన్నారు. ఇజ్రాయిల్ వినాశనమే హమాస్ కోరుకుంటోందని కాబట్టి సానుకూల రాజీ జరిగే పరిస్థితి కనిపించడంలేదన్నారు. రెండు దేశాల పరిష్కారంలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు భాగస్వాములు కాగలరన్న ఆధారాలు లేవని చెప్పారు. ఇజ్రాయిల్-పలస్తీనా పోరు తీవ్రతరం దాల్చిన క్రమంలో నెతన్యాహు అధికారంలో కొనసాగడం కష్టమేనని అక్టోబరులో వాల్ స్ట్రీట్ జర్నల్‌లో వార్తాకథనం ప్రచురితమైంది. కాగా, ఈ ఘర్షణ ముగిసిన తర్వాత పలస్తీనా చేతుల్లోనే అధికారం ఉండాలని అమెరికా చెబుతోంది.

సిరియా సైనిక స్థావరాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

దక్షిణ సిరియాలోని సైనిక స్థావరాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో తీవ్ర నష్టం జరిగినట్లు సిరియా రక్షణశాఖ ఒక ప్రకటన చేసింది. అర్ధరాత్రి లెబనాన్ బాల్‌బేక్ నగరం దిశగా ఇజ్రాయిల్ దళాలు దాడులు చేసి అనేక సైనిక స్థావరాలను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. రాజధాని డమాస్కస్ శివార్లలో దాడులు జరిగినట్లు షామ్ ఎఫ్‌ఎం రేడియో, సిరియా అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ నివేదించాయి. అంతర్జాతీయ విమానాశ్రయానికి 12కిమీల దూరంలోని సైనిక వైమానిక స్థావరం వద్ద అక్రాబా ఫామ్స్ లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు చేసినట్లు వెల్లడైంది. అలాగే అర్ధరాత్రి సమయంలో అల్ ఒమర్ చమురు క్షేత్రం సమీపంలోని అమెరికా సైనిక స్థావరంపై 15 క్షిపణులను దాడి జరిగింది. సిరియా భూభాగంలో అమెరికా యుద్ధ విమానాలు దాడులు చేశాయి.

మహువా బహిష్కరణకు రంగం సిద్ధం

న్యూఢిల్లీ: బీజేపీ కక్ష సాధింపు రాజకీయాలు నిస్సిగ్గుగా కొనసాగుతున్నాయి. ప్రధాని మోదీ అనుంగు మిత్రుడు, పారిశ్రామికవేత్త అదానీ టార్గెట్‌గా విమర్శలు చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాను లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. ఆమెను ఎంపీ పదవి నుంచే తప్పించాలని కుట్ర చేస్తోంది. అందులో భాగంగా ఆమెపై డబ్బులు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలు మోపింది. ఈ వివాదాన్ని లోక్‌సభ నైతిక విలువల కమిటీకి నివేదించింది. దీనిపై విచారణ జరిపామని చెప్పుకుంటున్న కమిటీ...ఆమెను లోక్‌సభ సభ్యత్వం నుంచి బహిష్కరించాలని సిఫార్సు చేసింది. మహువాకు సంబంధించిన ఆరోపణలపై దర్యాప్తు చేపట్టి రూపొందించిన నివేదికను నైతిక విలువల కమిటీ గురువారం ఆమోదించింది. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరానందాని నుంచి మొయిత్రా డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ విచారణ జరిపింది. దర్యాప్తులో భాగంగానే మహువా మొయిత్రాతో పాటు ఆమెపై ఫిర్యాదు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే, న్యాయవాది జై అనంత్ దెహద్రాయ్‌ను కమిటీ విచారించింది. అనంతరం 500 పేజీలతో కూడిన నివేదిక రూపొందించింది. బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోన్కర్ నేతృత్వంలోని నైతిక విలువల కమిటీ గురువారం సమావేశమై ఈ నివేదికను పరిశీలించింది. అనంతరం 6:4తో నివేదికను కమిటీ ఆమోదించింది. సమావేశం అనంతరం సోన్కర్ మాట్లాడుతూ ప్యానెల్‌లోని ఆరుగురు సభ్యులు నివేదికను సమర్థించగా...నలుగురు వ్యతిరేకించారని చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం నివేదికను శుక్రవారం (నవంబరు 10న) లోక్‌సభ స్పీకర్‌కు సమర్పించనున్నారు. ప్యానెల్‌లోని ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ ఈ సిఫార్సులు పక్షపాత ధోరణిలో ఉన్నాయని మండిపడ్డారు. మరోవైపు, నివేదికను ఎథిక్స్ కమిటీ ఆమోదించడానికి ముందే అందులోని ముఖ్యాంశాలు బయటకు రావడం చర్చనీయాంశమయ్యాయి. నివేదికలోని కొన్ని ముఖ్య విషయాలను ఓ జాతీయ వార్తా సంస్థ బుధవారం వెలుగులోకి తెచ్చింది. మహువా మొయిత్రాను ఎంపీగా కొనసాగించరాదని, ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని నైతిక విలువల కమిటీ సిఫార్సు చేసినట్లు ఆ కథనం నిన్నే వెల్లడించింది.

కేంద్రం కుట్ర: అభిషేక్

మహువా మొయిత్రాకు ఆ పార్టీ అగ్రనేత అభిషేక్ బెనర్జీ మద్దతుగా నిలిచారు. కొంతమంది రాజకీయాలకు ఆమె బాధితురాలయ్యారని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలపై ఒంటరిగా పోరాడే సామర్థ్యం ఆమెకు ఉందన్నారు. మహువాపై వచ్చిన ఆరోపణలపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సహా పార్టీ కీలక నేతలంతా మౌనంగా ఉంటున్న వేళ...అభిషేక్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కోల్‌కతాలో ఈడీ కార్యాలయం ముందు బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న రాజకీయాలకు ఆమె బాధితురాలయ్యారని మండిపడ్డారు. నాలుగేళ్లుగా తనను కూడా ఇలాగే కేసుల పేరుతో వేధిస్తున్నారని దుయ్యబట్టారు. 'అదానీ అంశంపై ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా... వారికి ఇలాంటి వేధింపులు తప్పవు. మహువా మొయిత్రాపై వచ్చిన ఆరోపణలతో ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని నైతిక విలువల కమిటీ సిఫార్సు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెపై వచ్చిన ఆరోపణలు నిజమని ఇంకా తేలనేలేదు. దానిపై దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉందని ఎథిక్స్ కమిటీనే అభిప్రాయపడింది. అలాంటప్పుడు ఆరోపణలు రుజువు కాకుండా ఆమెపై ఎలా చర్యలు తీసుకుంటారు' అని అభిషేక్ బెనర్జీ ప్రశ్నించారు.

కక్ష కట్టిన కాషాయం

(మొదటిపేజీ తరువాయి)

వైభవ్ గెహ్లోత్‌పై ఈడీ ఒకేరోజు దాడులు చేసింది. రాబోయే ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపికలో పార్టీలు నిమగ్నమైన వేళ దర్యాప్తు సంస్థలు దాడులు తీవ్రతరం చేసి ప్రతిపక్ష పార్టీల ఎన్నికల ప్రచారానికి గండి కొట్టాలన్న అమిత్‌షా వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి.

మోదీ హయాంలో సీబీఐ పంజరంలో చిలుకగా మారిందని సుప్రీంకోర్టు 2013లోనే వ్యాఖ్యానించింది. ఈ చిలుకకు ఈడీ, ఐటీ తోడవడంతో గుంపు తయారైంది. ప్రతిపక్ష పార్టీలపై చర్యలకే దర్యాప్తు సంస్థలు ప్రాధాన్యత ఇవ్వాలని కొత్త మార్గదర్శకాలు చెబుతున్నాయి. దర్యాప్తు సంస్థలు జరిపే ప్రతి దాడి, అరెస్టు, విచారణకు బీజేపీ నేతల సమర్థన ఉంటోంది. బీజేపీలో చేరుతారా లేక బుల్డోజర్లను ఎదుర్కొంటారా అని కాంగ్రెస్ నేతలను మధ్యప్రదేశ్ మంత్రి మహేంద్ర సింగ్ సిసోదియా హెచ్చరించడం ద్వారా ఆ పార్టీలో ఉన్న వారు తప్ప మిగతా పార్టీ నేతలంతా దర్యాప్తు సంస్థల ఉచ్చులో చిక్కుకోవాల్సినదేనన్న స్పష్టత వచ్చింది. ఎన్డీయేతో జతకట్టిన క్రమంలో తనకు రక్షణ హామీ ఉండటంతో జేడీ(ఎస్) నేత హెచ్‌డీ దేవగౌడ కూడా రెచ్చిపోయారు. తీహార్ జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను బహిరంగంగానే హెచ్చరించారు. ఒకవేళ మద్యం కేసులో అరవింద్ కేజ్రీవాల్ జైలుకు వెళితే గనుక అది గేమ్‌ఛేంజర్ అవుతుంది. నిరాధార ఆరోపణలతో ముఖ్యమంత్రిని జైలుకు పంపితే ప్రతిపక్ష సీఎంలు ఎవరికీ రక్షణ లేదని తేలిపోతుంది. అంటే మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్ లేక అఖిలేశ్ యాదవ్, ఉద్ధవ్ ఠాక్రేకు ముప్పు పొంచివున్నట్లు అవుతుంది. రాజకీయ బాస్‌లు ఏ నేత పేరు చెబితే వారిపై ఈడీ చర్యలకు ఉపకరిస్తుంది. 'ఈడీపై ఒక రోజు నియంత్రణ అప్పగిస్తే బీజేపీ సీనియర్లు అందరూ జైల్లో ఉంటారు' అన్న కేజ్రీవాల్ వ్యాఖ్యల అర్థమిదే! వేరొక పార్టీ అధికారంలోకి వస్తే బీజేపీ నేతల తప్పుల చిట్టా బహిర్గతమవుతుందని రుజువు చేసే ప్రయత్నాన్ని ఆయన చేశారు. మమతా బెనర్జీ కూడా ప్రశ్నించారు. 'బీజేపీ నేతల్లో ఏ ఒక్కరి ఇంటిని ఈడీ ఎందుకని సోదా చేయలేదు? లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతల ఇళ్లను మాత్రమే సోదా చేస్తారా? మీరు తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తారు. మా వద్ద మీపై ఆధారాలు పెన్‌డ్రైవ్‌లలో నిక్షిప్తమై ఉన్నాయి. కానీ మేము వాటిని బయటకు తేవడం లేదు' అని మమత అన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ దేశంలోని ప్రతిపక్ష నేతలపై ఈడీ దాడులు జరిపిస్తూ బీజేపీ మురికి రాజకీయాలు చేస్తోందని ఇంతకుముందు దుయ్యబట్టారు. ఇటువంటి కుయుక్తులతో బీజేపీ ఓట్లు గెలుచుకోలేదని విమర్శించారు. ఏదిఏమైనా ఈడీ ధోరణి అత్యంత ప్రమాదకరంగా ఉంటోంది. నిందితుడి మాజీ సహచరులు లేక కొద్దిపాటి ప్రమేయం ఉన్న వారిని తెచ్చి ఆధారాలు సృష్టించడమే ఈ ఆపరేషన్లలో తరచూ జరుగుతోంది. చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్‌కు రూ.508 కోట్ల కొరియర్ వ్యవహారంపై ప్రధాని మోదీ హడావిడి ప్రచారానికి బీజేపీ స్టార్ అధికార ప్రతినిధి స్మృతి ఇరానీ వంత పాడారు. కాంగ్రెస్‌పై ఎన్నికల 'హవాలా డబ్బు' ఆరోపణలు చేశారు. అదే విధంగా ఆప్ మంత్రి సహాయకుడు రాజ్ కుమార్ ఆనంద్ విషయంలోనూ జరిగింది. హవాలా మార్గంలో రూ.7కోట్లను చైనాకు మంత్రి పంపినట్లు ఈడీ విచారణలో మంత్రి సహచరుడు చెప్పింది నిజమైతే దీనిని తీవ్రంగా పరిగణించాల్సిందే. అయితే దర్యాప్తు సంస్థలు వ్యవహారం రాజకీయ బాస్‌లకు అనుకూలంగా ఉండటంతో ఆ సంస్థల విశ్వసనీయత సందేహాత్మకంగా మారింది. తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ విచారణ సమయంలో బీజేపీలో చేరండి లేదంటే విచారణను ఎదుర్కోమని ఈడీ అధికారులు చెప్పినట్లు కపిల్ సిబల్ వెల్లడించారు. ఒకే ఇంటిని వేర్వేరు దర్యాప్తు సంస్థలు ఐదుసార్లు తనిఖీ చేయాల్సిన అవసరం ఏమిటని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ రెండేళ్ల కిందట ప్రశ్నించారు. మహారాష్ట్ర మాజీ మంత్రి నవాబ్ మలిక్‌పై దాడులనుద్దేశించి ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. ఈడీ మాజీ చీఫ్ సంజయ్ కుమార్ మిశ్రా పదవి విరమణ సమయానికి మాయావతి నోరు కట్టేశారు. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీని చీల్చారు. ఆయన ఉండగానే అనేకమంది ఎన్‌సీపీ, శివసేన నేతలపై అనేక ఎఫ్ఐఆర్‌లు, కేసులు నమోదయ్యాయి. కేసులు ఎదుర్కొన్న వారిలో అజిత్‌పవార్, ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌పాల్ ఉన్నారు. రూ.25వేల కోట్ల కుంభకోణంలో అజిత్ పవార్, మనీలాండరింగ్ కేసులో పటేల్ ఆరోపణలు ఎదుర్కొన్నారు. అయితే బీజేపీలో చేరి ప్రాసిక్యూషన్‌ను తప్పించుకున్నారు. ఈడీ కొత్త చీఫ్ రాహుల్ నవీన్ కూడా అదే బాట అనుసరిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కర్నాటకపై, కాంగ్రెస్ నేతలపై దాడుల జోరు పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లోకి అడుగు పెట్టేందుకు స్థానిక పార్టీలను బలహీనపర్చేందుకు బీజేపీ వారు కుట్రలు పన్నుతున్నారు.

విద్యార్థులకు 'పరీక్ష'

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌ఏ-1, 2 గా కుదించుకుపోయాయి. వాస్తవంగా ఎస్‌ఏ-1 పరీక్ష డిసెంబరులోను, ఎస్‌ఏ-2 పరీక్ష ఏప్రిల్‌లో జరగాలి. వాటిని ఇష్టానుసారంగా నిర్వహించడం వల్ల విద్యార్థులు పూర్తిగా సన్నద్ధం కాలేకపోతున్నారు.

పెరిగిన సిలబస్ భారం

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠ్యాంశాల్లోనూ సమూల మార్పులు తీసుకొచ్చింది. పుస్తకంలో ఒకవైపు పేజీలో తెలుగు, మరోవైపు పేజీలో ఇంగ్లీషు మాధ్యమంలో ద్విభాషా పాఠ్యపుస్తకాలు ముద్రించింది. ఈ విధానంతో పాఠ్యపుస్తకాల పేజీల సంఖ్య పెరిగి, వాటిని చదవడం విద్యార్థులకు భారంగా మారుతోంది. గతంలో మూడు మాసాంత పరీక్షలకు ముందు యూనిట్ 1, 2 నిర్వహించగా, వాటిని విద్యార్థులు సమర్థవంతంగా రాసేవారు. వారికి పరీక్షల భయం ఉండేది కాదు. క్వార్టర్లీ పరీక్షకు ఒత్తిడి లేకుండా హాజరయ్యేవారు. ఇప్పుడు ఆ తరహా పరీక్షల విధానం పూర్తిగా కనుమరుగైంది. ఎస్‌ఏ-1, ఎస్‌ఏ-2 పరీక్షలను సెమిస్టర్ విధానంలో నిర్వహించడంతో సిలబస్‌ను పూర్తిగా చదవలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు ప్రతిభ చూపలేకపోతున్నారు. పరీక్షలు శాస్త్రీయ విధానంలో నిర్వహించాలనే ప్రభుత్వ ఆలోచనను అందరూ స్వాగతిస్తున్నారు. దానికి తగినంతగా పాఠశాలల్లో ఆహ్లాదకరమైన పరిస్థితులు ఉండాల్సిన అవసరముంది. బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోవడంతో సకాలంలో సిలబస్ పూర్తి చేయడం ఉపాధ్యాయులకు కష్టతరంగా మారింది. అదనపు బోధనా తరగతులతో ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తిచేస్తున్నప్పటికీ... వారి శ్రమను ఉన్నతాధికారులు గుర్తించలేకపోతున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే జగనన్న విద్యా కానుకతోపాటు పాఠ్యపుస్తకాలను ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేసింది. 1 నుంచి 10 తరగతుల వారికి సెమిస్టర్ల వారీగా పుస్తకాలు అందజేసింది. నిత్యం పాఠశాలల్లో ఉన్నతాధికారులు తనిఖీలు చేస్తూ ఉపాధ్యాయులపై మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారనే విమర్శ ఉంది. పరీక్షల షెడ్యూలు ఇష్టానుసారంగా మార్చడంపైనా తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల విధానం సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

28 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

సమ్మెటివ్ అస్సెస్‌మెంట్ (ఏస్‌ఏ)-1 పరీక్షల తేదీలు మార్పు చేశారు. ఈనెల 28వ తేదీ నుంచి డిసెంబరు 2 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ ఈనెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ఉన్నందున వాయిదా వేశారు. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీజేశారు. 2023-24 విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులకు 28న తెలుగు, 29న హిందీ, 30న ఇంగ్లీషు, డిసెంబరు 1న లెక్కలు, 2న జనరల్ సైన్స్, 4న బయాలజీ, 5న సోషల్, 6న టోఫెల్ పరీక్షలు నిర్వహిస్తారు. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు 28న తెలుగు, 29న ఇంగ్లీషు, 30న లెక్కలు, డిసెంబరు 1న ఈవీఎస్, 2న టోఫెల్ పరీక్షల షెడ్యూలును ఖరారు చేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌కు రెండు గంటల వ్యవధి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన టోఫెల్ పరీక్షను మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహిస్తారు.

అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం పులివెందుల

సీఎం జగన్ స్పష్టీకరణ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల అభివృద్ధికి నిలువెత్తు దర్శనమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టీకరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం వైఎస్ఆర్ కడప జిల్లాకు విచ్చేసిన సీఎం జగన్... మొదటి రోజు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ. 64.54 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు గావించారు. ముందుగా అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 1.30 గంటలకు పులివెందుల భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. భాకరాపురం రింగురోడ్డు సర్కిల్‌లో 4 ఎకరాల విస్తీర్ణంలో రూ.4.54 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. స్వామి

వారిని దర్శించుకుని ముఖ్యమంత్రి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రూ.9.96 కోట్లతో ఏపీ కార్ల్ నందు నిర్మించిన అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ కాలేజీలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అగ్రికల్చర్ కళాశాలలో 60 సీట్లు బీఎస్సీ (హెూమ్) అగ్రికల్చర్, హార్టికల్చర్ కు సంబంధించి బీఎస్సీ (హాన్) హార్టికల్చర్ 61 సీట్లతో కోర్సులను అందిస్తున్నారు. ఏపీ కార్ల్ నందు రూ.11 కోట్ల వ్యయం నిర్మించిన స్టేట్ ఆఫ్ ఆర్ట్ సెంట్రల్ టెస్టింగ్ లాబొరేటరీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. పాలు, పాల ఉత్పత్తుల కల్తీని తనిఖీ చేయడం, నాణ్యతా పరీక్ష, ఆహార ధాన్యాలు, తృణధాన్యాలు పప్పుల నమూనాలను, ఫార్మా అప్లికేషన్ పరీక్షల నిర్వహణకై దీన్ని ఏర్పాటు చేశారు. పులివెందుల వాసులకు అత్యంత ఆహ్లాదకర, ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పిస్తూ... మొత్తం 38 ఎకరాలలో రూ .14.04 కోట్లతో నిర్మించిన శిల్పారామంలో ఫేస్ లిఫ్టింగ్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. 28 ఎకరాల్లో శిల్పారామం ఉండగా... ఇందులో 10 ఎకరాల్లో ఫంక్షన్ హాల్, మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ విత్ గ్యాలరీ, 16.5 అడుగుల వైఎస్సార్ విగ్రహంతో హిల్ టాప్ టవర్, హిల్ టాప్ పార్టీ జోన్, జిప్ లైన్ (రోప్ వే), బోటింగ్ ఐలాండ్ పార్టీ జోన్, చైల్డ్ ప్లే జోన్,వాటర్ ఫాల్, ఫుడ్ కోర్ట్, ఆర్టిసన్స్ స్టాల్స్‌తో పాటు 5 అడుగులున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూర్చున్న విగ్రహం తో ఆకట్టుకునే ఎంట్రీ ప్లాజా, సీసీ రోడ్లు, పార్కింగ్ ఏరియా, ఆహ్లాదకర గ్రీనరీ ఈ శిల్పారామం ప్రత్యేకతగా నిలిచాయి. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, జిల్లా ఇంచార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలతో పాటు.. ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి దనుంజయ రెడ్డి, పులివెందుల ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ వ్యవస్థాపకులు ధరణి శ్రీమణి రమణ దంపతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే ఆయుధం: జయలక్ష్మి

విశాలాంధ్ర-ఒంగోలు: ఆధునిక ప్రపంచంలో హక్కులను రక్షించుకోవటానికి, చట్టాలను అమలు చేయించుకోవటానికి పోరాటాలే ఆయుధాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు వి జయలక్ష్మి అన్నారు. మహిళా సమాఖ్య ప్రకాశం జిల్లా మహాసభ గురువారం నిర్వహించారు. ఈ మహా సభకు అధ్యక్షవర్గంగా కే శాంతి లత, ఎం విజయ, ఆర్ లక్ష్మి వ్యవహరించారు. మహాసభకు ముందుగా మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు ఆర్ రాజ్యలక్ష్మీ జెండా ఆవిష్కరించారు. జయలక్ష్మి మాట్లాడుతూ హక్కుల సాధన, మహిళాభివృద్ధి కోసం పోరాటాలు చేయకతప్పదన్నారు. ఈ పాటికే ఉన్న హక్కులు, చట్టాలు ఊరికే రాలేదని, అనేక మంది త్యాగాలు, పోరాటాలు వీటిలో దాగిఉన్నాయన్నారు. సంపూర్ణమద్య నిషేధం అమలు చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ అందుకు విరుద్ధంగా పాలన సాగిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాదాన్ని అమలులోకి తీసుకువచ్చి మహిళలను వంటింటి కుందేలుగా మార్చాలని చూస్తున్నదన్నారు. ఆధునిక మహిళ ఏ ఏ వస్త్రాలు ధరించాలో, ఎలా ఉండాలో శాసిస్తున్నారన్నారు. వివిధ పథకాల పేరుతో వంకాయ అంత ఇస్తూ, గుమ్మడికాయ అంత గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు ఉద్యోగాలు చూపటం లేదన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ రంగానికి అమ్మేస్తున్నారన్నారు. ఇంటిల్లిపాది కష్టించి పని చేసిన కుటుంబాలు గడవడం లేదన్నారు. దీంతో మహిళలు ఇంటిలోనే కాకుండా ఇంటి బయట కూడా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. అదే స్థాయిలో మహిళల సమస్యలు చెప్పినా పట్టించుకునే నాధుడు కరువయ్యారన్నారు. దేశంలో ధనస్వామ్యం రాజ్యమేలుతున్నదన్నారు. మహిళలకు రక్షణ కరువైందన్నారు.మహిళలు సమాజంలోనే కాకుండా అన్ని రంగాలలో సగభాగమని నిరూపించుకోవాలన్నారు. చైతన్యవంతమై పూర్తిగా నిలవాలి అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని మహిళ నుంచి పట్టణ ప్రాంత మహిళల వరకు ప్రతి ఒక్కరూ సంఘంలో చేరాలన్నారు. ఈ నెల 17, 18,19 తేదీలలో నంద్యాలలో నిర్వహించే మహిళా సమాఖ్య రాష్ట్ర 14వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం సాగించే ప్రతి పోరాటంలో సీపీఐ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రావమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు నివారించాలి

డీహెచ్‌పీఎస్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: దళితులపై దాడులు పెచ్చుపెరిగిపోతున్నాయనీ, వాటిని అడ్డుకునేందుకు పాలకులు చర్యలు తీసుకోవడంలేదని దళితహక్కుల పోరాట సమితి నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. దళిత హక్కుల పోరాట సమితి పశ్చిమ గోదావరి జిల్లా సమావేశం తాడేపల్లిగూడెంలోని కపర్ది భవన్‌లో కే లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు మాట్లాడుతూ దళితులపై దాడులను, హత్యలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు కనీసం ఖండించడం లేదన్నారు. దళిత కులాలు, దళిత ఉపకులాలు మాల మాదిగలు ఐక్యంగా ఉండి దళితులపై దాడులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. దళిత బిడ్డలు చదువుకొని చైతన్యవంతులై ఉద్యోగాలు సంపాదించినా, రాజకీయాల్లో ఉన్నప్పటికీ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేయలేదన్నారు. మతతత్వం అనేది రాజకీయాల్లో ఉండకూడదని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అదే తీరును అవలంబిస్తున్నదని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం సమాన హక్కులు కలిగి ఉండాలనీ, బీసీ ఎస్టీ మైనారిటీ, వర్గాల వారందరికీ సామాజిక న్యాయం కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన వారికి శిక్ష పడాలంటే కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు మెరుపు జాన్ రాజ్, తాటికొండ శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉలింకల జయకృష్ణ, డీహెచ్‌పీఎస్ నాయకులు కంకట రత్నకుమార్, ఉండ్రాజవరపు మురళి, చింతాడి ఫ్రాన్సిస్, జాలపర్తి వెంకట్రావు, దేపల్లి సుబ్బారావు, పొట్ల ఆనందరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధం

సచివాలయ సిబ్బంది వినియోగంపై ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయవాడ: అధికార వైసీపీ చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వినియోగించడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. గురువారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులుగా సచివాలయం సిబ్బందిని నియమించుకుని... వారిని పార్టీ కార్యక్రమాలకు వాడటం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. సీఎం జగన్ మానస పుత్రిక అని చెప్పుకుంటున్న గ్రామ-వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పడిన నాటి నుండి క్షేత్ర స్థాయిలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోని ముఖ్యమంత్రి... వారిని పార్టీ కార్యక్రమాల ప్రచారానికి వినియోగించుకోవడం దుర్మార్గమని విమర్శించారు. సచివాలయ ఉద్యోగులు దయనీయ స్థితిలో ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి పనిచేస్తున్నారని, పై అధికారుల వేధింపులు తాళలేక వందల సంఖ్యలో ఉద్యోగం మానేసి ప్రైవేట్ కంపెనీలకు వెళ్లారని తెలిపారు. చెత్త పన్ను వసూలు విషయంలో అధికారుల వేధింపులు తాళలేక కొంతమంది ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. ఇంధన సహాయకులను సచివాలయంలో పనిచేయకుండా విద్యుత్ శాఖలో అన్ని రకాల పనులకు వినియోగిస్తున్నారన్నారు. అనుభవం లేని వీరిని విద్యుత్ స్తంభాలు ఎక్కించడంతో ప్రమాదాలు జరిగి పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. సంబంధిత శాఖాధికారులతో ఏరోజు ఈ విషయమై సీఎం సమీక్ష చేసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులుగా డిగ్రీ, పీజీ చదివిన వారిని నియమించి, వారి చేత ఏడవ తరగతి చదివిన మేస్త్రీ మాదిరిగా పని చేయిస్తున్నా... ఉన్నతాధికారులపై ఏనాడూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. సచివాలయ వ్యవస్థ సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా, మహిళా కార్యదర్శులు ఉన్నారని చూడకుండా పురపాలక శాఖ ఉన్నతాధికారులు జీఓ.423 ఇచ్చి వారిని ఉదయం 5 గంటలకు విధులకు హాజరావ్వాలని, పారిశుధ్య కార్మికుల వెంబడి తిరగాలని, చెత్త పన్ను వసూలు చేయాలని వేధిస్తున్నారని చెప్పారు. సచివాలయం ఉద్యోగుల మీద అధికార పార్టీ నాయకులు దాడులు చేస్తున్నా సీఎం పట్టించుకోలేదన్నారు. ఇవేవీ పట్టించుకోని ముఖ్యమంత్రి... వారిని ఈరోజు పార్టీ కార్యక్రమాలకు ఎలా ఉపయోగించుకుంటారని నిలదీశారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఇన్ని ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్, ఫెడరేషన్ నాయకులు చోద్యం చూస్తూ సీఎం జగన్‌కు భజనలు చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులు ఒక సెలవు కావాలంటే నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు, నలుగురు పైఅధికారుల సంతకాలు కావాలని... వారి పైఅధికారులు వేధిస్తున్నా ఉద్యోగ సంఘాలు స్పందించి, పరిష్కారం చూపలేదన్నారు. సచివాలయ ఉద్యోగులు, అధికారుల వేధింపులు భరించలేక మానసిక రుగ్మతలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా స్పందించి, ఆ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పై సమీక్ష చేసి, వారి సమస్యలు పరిష్కరించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

'జగన్ ఎందుకు కావాలంటే' ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే) కార్యక్రమాన్ని వైసీపీ నేతలు లాంఛనం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి రోజు 711 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో దీనిని ప్రారంభించారు. గ్రామీణ, పట్టణాల్లో మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. మండలాల ప్రాతిపదికన రోజుకో సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందుకోసం నగరాలు, పెద్ద పట్టణాల్లో సులభంగా కొనసాగేలా విధి విధానాల్ని రూపొందించారు. స్థానిక ప్రజాప్రతినిధుల అధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమా నికి ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర ప్రముఖులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. గృహ సారథులు, పార్టీ సానుభూతి పరులు, సీఎం జగన్ అభిమానులు ఇందులో భాగస్వాములయ్యేలా ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా జరిగిన ప్రగతి, మార్పులను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో అందరూ వచ్చేలా ఒక రోజు ముందస్తుగానే ఎస్ఎంఎస్ ద్వారా వారికి సమాచారం ఇస్తున్నారు.

ఇప్పటికే వైసీపీ అధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక సాధికార బస్సు యాత్ర కొనసాగుతోంది. దానికి అంతరాయం కలగుండా వై ఏపీ నీడ్స్ జగన్‌కు ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రస్తుతం 7,610 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆయా కార్యక్రమాల షెడ్యూలును రూపొందించి, కలెక్టర్ల ద్వారా సచివాలయాలకు సమాచారం అందించారు. మిగిలిన సచివాలయాలకూ త్వరలో షెడ్యూలు ఖరారు చేస్తారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా 24 పేజీలతో కూడిన ప్రత్యేక బుక్‌లెట్లను రూపొందించి, వలంటీర్లు ఇంటింటికి వెళ్లిన సమయంలో, వాటిని ప్రతి ఒక్కరికీ అందజేస్తారు.

కారా కలమే... కథానిలయం

కాళీపట్నం రామారావు సాహిత్య సభలో వక్తలు

విశాఖపట్నం: కాళీపట్నం రామారావు కలమే కథానిలయమని వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విశాఖపట్నం జిల్లా సమితి అధ్వర్యంలో గురువారం విశాఖపట్నంలోని పౌరగ్రంధాలయంలో 'కారా కథలు-సమాలోచన' అనే అంశంపై సాహిత్య సదస్సు జరిగింది. అరసం విశాఖపట్నం జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు. 'కారా కథలు సాహితీ జీవితం' అంశంపై డాక్టర్ దామెర వెంకట సుబ్బారావు మాట్లాడారు. కారా సాహిత్య సృజన మొత్తం నిజజీవిత అనుభవాల నుంచే వెలువడిందన్నారు. జన సామాన్య సమస్యలను కథల ద్వారా వెలుగులోకి తెచ్చారని చెప్పారు. శ్రామిక పక్షం వహించి వర్గ సంఘర్షణల్ని కథల్లో వ్యక్తం చేశారన్నారు. ఉన్నత, ధనిక వర్గానికి చెందిన కారా విద్యార్థి దశ నుంచే విస్తృత అధ్యయనం ద్వారా సామాజిక సాహితీవేత్తగా రూపాంతరం చెందారని తెలిపారు. సమాజ పోకడపై స్పష్టమైన అభిప్రాయం ఏర్పడ్డాక యజ్ఞం, చావు లాంటి గొప్ప కథలు రాశారన్నారు. యజ్ఞం కథపై జరిగినంత చర్చ, విమర్శ తెలుగు సాహిత్యంలో మరో కథపై జరుగలేదని గుర్తుచేశారు. కథకుడిగానే కాకుండా వ్యాసకర్తగా, విమర్శకుడిగా గుర్తింపు పొందినట్టు సుబ్బారావు వెల్లడించారు. 'కారా కథ ప్రపంచం' అనే అంశంపై ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రామిక వర్గం ఆత్మ గౌరవం కోసం కారా కలం గొప్ప కృషి చేసిందన్నారు. ప్రపంచంలో కథలకు ఇల్లు (కథానిలయం) కట్టిన గొప్ప వ్యక్తులు ఇంకెవరు లేరని చెప్పారు. రాసిన 50 కథలను కార్మిక, పేద, దళిత, మధ్యతరగతి పక్షం వహించిన కళాప్రపూర్ణ కా.రా అన్నారు. ఆర్తి, చావు, హింస వంటి కథల్లో శ్రామిక వర్గంపై జరుగుతున్న కుట్రల్ని ఎత్తి చూపించి చైతన్యం కలిగించారు. కారా కథలు వివిధ భాషల్లోకి అనువాదం చెందాయని, యజ్ఞం కథ అమెరికా అధ్యక్ష భవనం 'శ్వేతసౌధం'కు చేరిందని తెలిపారు.

'కారా కథ సంవిధానం'పై ప్రముఖ విశ్లేషకులు విశాఖ వర్మ ప్రసంగించారు. ఉత్తరాంధ్ర ఉత్తమ పుత్రుడు కారా మాస్టారని చెప్పారు. వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన కారా అత్యున్నత సమాజం నిర్మాణం కోసం కలాన్ని కదిలించారని తెలిపారు. ప్రజలంతా స్థాయి బేధాలు లేకుండా సమానంగా జీవించాలనే ఆకాంక్ష కారా సాహిత్యంలో కనిపిస్తుందని తెలిపారు. ప్రతి కథలో స్పష్టమైన వైఖరి ఉంటుందన్నారు. అపారమైన ప్రజాస్వామికవాదిగా కథా ప్రపంచంలో గుర్తింపు పొందారని వర్మ తెలిపారు. అనంతరం కారా మాస్టారుతో, ఆయన సాహిత్యంతో తమకున్న జ్ఞాపకాలను శేఖరమంత్రి ప్రభాకర్, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్ రెడ్డి, మాటూరి శ్రీనివాస్, బసు పోతన, పీఏరాజు, బొట్టా అప్పారావు, పల్లా జగదీశ్వరరావు తదితరులు పంచుకున్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీయస్ శర్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. అరసం జిల్లా కార్యదర్శి పి శ్యామసుందర్ సమావేశానికి ఆహ్వానం పలుకగా, జిల్లా కార్యదర్శి డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్ రెడ్డి వందన సమర్పణ చేశారు.

సైనికుడిపై దాడి: పోలీసుల సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సైనికుడి పట్ల దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడిన నలుగురు పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాల్సిందిగా రేంజ్ డీఐజీ, జిల్లా ఎస్పీకి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం సంతబయలు వద్ద దిశ యాప్ డౌన్ లోడ్ విషయంలో సైనికుడిపై దురుసుగా ప్రవర్తించి అతనిపై దాడికి పాల్పడిన పరవాడ కానిస్టేబుళ్లు ముత్యాలనాయుడు, శోభారాణి, రమేష్, హెడ్ కానిస్టేబుల్ దేవళ్లుతో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లను తక్షణమే సస్పెండ్ చేయాల్సిందిగా డీజీపీ ఆదేశించారు. పోలీసులు ప్రజలకు రక్షణగా నిలవాలి తప్ప, దాడి చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు చర్యలు

సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోప నివారణ వంటి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్ రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖలకు సంబంధించి నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రక్తహీనత, పౌష్టికాహార లోపం గల బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించడం ద్వారా వారిని ఆ సమస్యల నుండి విముక్తులను చేయవచ్చన్నారు. తీవ్ర సమస్యలతో ఇబ్బందులు పడే గర్భిణీల డేటాను అందుబాటులో ఉంచుకొని... వారి ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కౌమార బాలికల్లో రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. డిసెంబరు నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు సంబంధించి స్క్రీనింగ్ టెస్టులు పూర్తి చేసేలా ఆయా విద్యాసంస్థల యజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్‌ను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటీ కృష్ణబాబు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ఇప్పటి వరకూ వివిధ అంశాల్లో సాధించిన లక్ష్యాలను వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి మాట్లాడుతూ పెరుగుదల సరిగా లేని, ఉండాల్సిన దానికంటే తక్కువ బరువు గల పిల్లల్లో లోపాలు నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐరన్ ఫోలిక్ సిరప్, టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీతో పాటు వండిన ఆహారం అందిస్తున్నామన్నారు. విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ విద్యాశాఖకు సంబంధించిన ఎస్డీజీ సాధించిన లక్ష్యాలు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, గృహనిర్మాణ శాఖ స్పెషల్ సెక్రటరీ దివాన్ మైదీన్, గ్రామ వార్డు సచివాలయాల అదనపు డైరెక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు.

అమలుకు నోచుకోని మహిళా చట్టాలు

డేగా ప్రభాకర్ విమర్శ

విశాలాంధ్ర-ఏలూరు: భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) పోరాటాల ఫలితంగానే మహిళా హక్కులు, చట్టాలు సాధించుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర 15వ మహాసభ సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో గురువారం జరిగింది. కొల్లూరు సుధారాణి, గొర్లి స్వాతి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. మహిళా సమాఖ్య పతాకాన్ని సీనియర్ సభ్యురాలు మన్నవ లక్ష్మీ సౌభాగ్యం ఆవిష్కరించారు. డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా మహిళా చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లోపించిందని ఆరోపించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మహిళా సమాఖ్య దేశవ్యాప్తంగా పోరాటాలు సాగించిందన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం...2029 తర్వాత దీనిని అమల్లోకి తెస్తామనడం మహిళలను వంచించడమేనన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, జనాభా లెక్కలు సాకుగా చూపి రిజర్వేషన్లు వాయిదా వేయడం మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం, సాధికారతే తమ లక్ష్యమని చెపుతున్న ప్రభుత్వాలు... ఆచరణలో మహిళలకు మొండిచేయి చూపుతున్నాయన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగించిందన్నారు. తాను అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్యపాన నిషేధమని నమ్మబలికి...విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారని జగన్‌పై విమర్శలు గుప్పించారు. రానున్న కాలంలో మహిళా సమస్యల పరిష్కారం కోసం మహిళా సమాఖ్య విస్తృత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

అనంతరం 11 మంది సభ్యులతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మహిళా సమాఖ్య ఏలూరు నగర అధ్యక్షురాలిగా కొండేటి బేబి, ఉపాధ్యక్షురాలిగా గొర్లి స్వాతి, కార్యదర్శిగా అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, సహాయ కార్యదర్శిగా కొల్లూరు సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు మన్నవ యామిని, ఉప్పులూరి లక్ష్మి, భవానీ, అయితాభక్తుల దుర్గాభవానీ, జోష్ మేరీ, తోట భవానీ, కె.రామలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎయిర్ పోర్టులో 15 నుంచి రాత్రివేళ విమానాల రాకపోకలు బంద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయాన్ని ఈ నెల 15 నుంచి రాత్రివేళ మూసివేస్తున్నట్టు విశాఖఎయిర్ పోర్టు అధికారులు తెలిపారు. రన్‌వే పునరుద్ధరణ పనుల కోసం రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు విమానాశ్రయం మూసివేయనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో పగటవేళ విమాన సర్వీసులు పెంచాలని అధికారులు నిర్ణయించారు. రాత్రిపూట విమానాశ్రయం మూసివేతపై నౌకాదళ అధికారులతో ఎంపీ జీవీఎల్ చర్చించారు. రన్‌వే పనుల కోసం రాత్రిపూట మూసివేత తప్పదని ఈఎన్సీ చీఫ్ తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రన్‌వే పునరుద్ధరణ పనులు పూర్తి చేసేందుకు 4 నుంచి 6 నెలల సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఏసీబీ వలలో చుండూరు ఎస్ఐ

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం చుండూరు ఎస్ఐ బోరుగడ్డ భరత్‌కుమార్ రూ.45 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. బాపట్ల పట్టణం అక్కురుపేటకి చెందిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బత్తుల గోవిందుపై చుండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో గోవిందును అరెస్ట్ చేయకుండా, స్కార్పియో వాహనాన్ని సీజ్ చేయకుండా ఉండేందుకు భరత్‌కుమార్ రూ.75 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో తొలివిడతగా ఎస్ఐకి రూ.30 వేలు చెల్లించారు. మిగిలిన సొమ్ము కోసం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ గుంటూరు రేంజ్ అదనపు ఎస్పీ ఎం.మహేంద్ర అధ్వర్యంలో చుండూరు స్టేషన్‌లో దాడులు నిర్వహించారు. ఎస్ఐ భరత్ తరపున ఐడీ కానిస్టేబుల్ నాగరాజు బాధితుడి నుంచి రూ.45 వేలు నగదు తీసుకుని రైటర్ గరికపాటి క్రాంతికుమార్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ భరత్, కానిస్టేబుల్ నాగరాజు, రైటర్ క్రాంతికుమార్‌లను విచారించి కేసు నమోదు చేసి అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఏసీబీ డీఎస్పీలు సత్యానందం, ప్రతాప్‌కుమార్, సీఐలు రవిబాబు, నాగరాజు, మన్మథరావు, సురేశ్, ఎస్ఐ శ్రీనివాసమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సంపాదకీయం

సమస్య రిజర్వేషన్లు కాదు పేదరికం

సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న వారి అభ్యున్నతి కోసం రిజర్వేషన్ల సదుపాయం కల్పించాం. రాజ్యాంగం రూపొందించినప్పుడు దళితులకు, గిరిజనులకు మాత్రమే రిజర్వేషన్ సదుపాయం ఉండాలనుకున్నాం. కానీ సమాజంలో ఇతర వెనుకబడిన తరగతుల వారూ ఉన్నారని డా. బి.ఆర్.అంబేద్కర్ ఆనాడే తెలియజేశారు. ఆయన అభిప్రాయానికి అనుగుణంగానే ఇతర వెనుకబడిన తరగతులవారికి కూడా రిజర్వేషన్లు అవసరం అనుకున్నాం. వెనుకబడిన వర్గాల వారి సంఖ్య అంచనా వేయడానికి మండల్ కమిషన్ ఏర్పాటు అయింది. ఆ నివేదికా చాలా కాలం అటక మీదే ఉండిపోయింది. రిజర్వేషన్లు ఆర్థిక ప్రాతిపదిక ఆధారంగా అమలు చేసినవికావు. అసలు ఆర్థిక వెనుకబాటు తనాన్ని రాజ్యాంగం పరిగణనలోకే తీసుకోలేదు. దళితులు, గిరిజనులను మాత్రమే ఆనాడు వెనుకబడిన తరగతుల వారిగా గుర్తించారు. అందువల్లే ఇప్పుడు వెనుక బడిన తరగతులవారిగా పరిగణిస్తున్న వారిని ఇతర వెనుకబడిన తరగతులు అన్నాం. రాజ్యాంగం సిఫార్సుచేసిన రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలు చేస్తే వారూ ఇతరులతో సమానస్థాయికి వస్తారని ఆశించాం. కానీ ఇప్పటికీ ఆ వర్గాలవారు ఆ స్థాయికి చేరుకోనేలేదు. ఇతర వెనుకబడిన వర్గాల వారిదీ అదే పరిస్థితి. రాజ్యాంగం కులాలవారీ రిజర్వేషన్లు కల్పించాలని అనుకోకపోయినా ఇతర వెనుకబడిన తరగతులవారి అభ్యున్నతి కోసం సానుకూల చర్యలు చేపట్టాలంటే వెనుకబాటుతనంలో కులాల ప్రస్తావన అనివార్యం అయింది. అందుకే బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇటీవలి కాలంలో కులగణన గురించి మాట్లాడుతున్నారు. బీజేపీ మినహా ఇతర పార్టీలూ కులగణను సమర్థించాయి. నితీశ్ కుమార్ కులగణనను జరిపించి ఆ వివరాలను బుధవారం శాసనసభలో వెల్లడించారు. దీనితో రాజకీయాల స్వరూపమే మారిపోతున్నట్టు కనిపిస్తోంది. కులగణన నిర్వహించడం అంటే దేశాన్ని చీల్చడమే అని ప్రధానమంత్రి మోదీ హుంకరిస్తుంటే ఆయన కుడిబుజం అయిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రం కులగణనకు తాము వ్యతిరేకం కాదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మరీ వెనుకబడిన వర్గాలవారి దుస్థితిని పట్టించుకోవలసిన అవసరాన్ని గుర్తించినందువల్లే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారు ఎంత మందో లెక్కలు తేల్చవలసిన అవసరం వచ్చింది. ఆర్థిక వెనుకబాటు తనం కొన్ని కులాలకే పరిమితమైంది కాదన్న వాస్తవం బయట పడింది. నితీశ్ కుమార్ శాసనసభలో ప్రవేశపెట్టిన కులగణన వివరాలనుబట్టి చూస్తే అగ్రవర్ణాలవారి పేదరికం ఇంతకాలం మనం అమలుచేసిన సానుకూల చర్యల డొల్లతనాన్ని బయట పెట్టింది. అగ్రవర్ణాలవారిలో 25 శాతం మంది పేదరికంలో మగ్గిపోతున్నారన్న అప్రియ సత్యం వెల్లడైంది. బిహార్‌లో భూవసతి దండిగా ఉన్న భూమిహార్లలోనూ 27.58 శాతం మంది పేదలేనని తేలింది. బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను బీమారు రాష్ట్రాలు అనే వారు. అంటే ఆ రాష్ట్రాలలో వెనుకబాటుతనం మిగతా రాష్ట్రాలకన్నా ఎక్కువ. బిహార్ పరిస్థితి 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా పెద్దగా మారలేదు. బిహార్‌కు చెందిన దళిత నాయకుడు బాబూ జగ్జీవన్ రాం స్వాతంత్ర్యం రాక ముందు ఏర్పడిన తాత్కాలిక మంత్రివర్గంనుంచి మొదలుకుని ఆయన మరణించే దాకా మంత్రిగానే ఉన్నారు. కానీ ఆయన దీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించిన ససారాం లోకసభ నియోజకవర్గం ఇప్పటికీ వెనుకబాటుతనంలో అగ్రభాగాన ఉంది. ఎన్ని ప్రభుత్వాలుమారినా, సామాజిక అంతరువులో అట్టడుగునఉన్న కర్పూరీ ఠాకూర్ దగ్గర నుంచి లాలూప్రసాద్ యాదవ్ దాకా వెనుకబడిన వర్గాలవారు బిహార్‌లో ముఖ్యమంత్రులైనా పరిస్థితిమాత్రం మారలేదు. అంటే రాజకీయాధికారం మౌలిక సమస్యను పరిష్కరించనే లేదు.

బిహార్‌లో నిర్వహించిన కులగణన వివరాలను పరిశీలిస్తే రిజర్వేషన్ల సదుపాయంలేని వారితో సహా ఆ సదుపాయం ఉన్నవారిలోకూడా వెనుకబాటుతనం పదిలంగా ఉన్నట్టు రుజువవుతోంది. నితీశ్ కుమార్ వెల్లడించిన కులగణన లెక్కలను బట్టి చూస్తే 34 శాతం కుటుంబాలు ఆ రాష్ట్రంలో పేదరికంలో కూరుకుపోయిఉన్నాయి. ఈ కుటుంబాలు నెలకు కేవలం ఆరువేలరూపాయల ఆదాయంతో బతుకీడిస్తున్నాయి. 1990 నుంచి ఉత్తరప్రదేశ్ లాంటి మరికొన్ని రాష్ట్రాలతోపాటు బిహార్ రాజకీయాలు దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలచుట్టూ తిరుగుతున్నా రిజర్వేషన్లు వర్తిస్తున్న దళిత, గిరిజన కుటుంబాలను పేదరికం వెన్నాడుతూనే ఉంది. అంటే కేవలం రిజర్వేషన్లు అభ్యున్నతికి దోహదం చేయలేదనే కదా. అంటే పేదరికానికి కారణమైన ఇతర కారణాలను అన్వేషించవలసి ఉందనే అర్థం. ఆ రాష్ట్ర ప్రజల వెనుకబాతుతనం బహుముఖీనమైంది. తలసరి ఆదాయంలోనూ బిహార్ అట్టడుగుననే ఉంది. మాతా శిశువుల ఆరోగ్యం, గృహవసతి, మంచి నీటి అందుబాటు, పారిశుద్ధ్యం, పాఠశాలకు వెళ్లే వారి సంఖ్య, విద్యుత్ సరఫరా, ఆస్తుల లాంటి అనేకానేక అభివృద్ధి సూచీలలో బిహార్ మిగతా రాష్ట్రాలకన్నా చాలా వెనుకబడే ఉంది. 1991లో అమలులోకివచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలూ బిహార్‌ను వెనుకబాటుతనం నుంచి గట్టెక్కించలేకపోయాయి. అక్కడి శ్రామికులు ఇప్పటికీ ప్రధానంగా వ్యవసాయంమీదే ఆధారపడక తప్పడంలేదు. ఉపాధి, విద్యావకాశాలు వెతుక్కుంటూ ఇతర రాష్టాలకు వలసవెళ్తున్న వారిలోనూ బిహార్ అగ్రస్థానంలోఉంది. దశాబ్దంపై నుంచి బిహార్ సగటున పదిశాతం అభివృద్ధి సాధిస్తున్నా పేదరికం నుంచి మాత్రం బయటపడడంలేదు. బిహార్‌లో నిరక్షరాస్యత కూడా అత్యధికంగానే ఉంది. అయిదో తరగతితో చదువు ఆపేసినవారు జనాభాలో 22.67శాతం ఉన్నారు. విద్యారంగంలో షెడ్యూల్డ్ కులాలకు రిజర్వేషన్లు ఉన్నా వారిలో పదకొండో, పన్నెండో తరగతి వరకు చదువుకున్నవారు కేవలం 5.76శాతమే. అక్షరాస్యత 61.8శాతం దాటలేదు. విద్యారంగ పరిస్థితి దయనీయంగాఉంది. ప్రాథమిక విద్య మరీ అధ్వానస్థితిలో మిగిలిపోయింది. పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో బోధించేవారికి సమయానికి జీతాలు అందవు. నాసిరకం ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యావ్యాపారానికే పరిమితం అవుతున్నాయి. అత్యంత వెనుకబాటుత్నాన్ని కూడా కులగణన పరిగణనలోకి తీసుకుంది. బిహార్ గణాంకాలు పేదరికం, సామాజిక న్యాయం లాంటి అంశాలపై దృష్టి నిలపవలసిన అగత్యాన్ని గుర్తు చేస్తోంది. ఆర్థిక న్యాయం సామాజిక న్యాయానికి దారితీస్తుంది. దీనికి కులాలవారీ గణాంకాలు తోడ్పడతాయి. ఉద్యోగాలు, విద్యా సంస్థలలో రిజర్వేషన్లను 65శాతానికి పెంచాలని నితీశ్ ప్రతిపాదిస్తున్నారు. ఇది అంతిమ పరిష్కారం కాకపోయినా ఆదిశగా ముందడుగు వేయడానికి ఉపకరించవచ్చు. నితీశ్ కుమార్ ప్రతిపాదన ప్రకారం షెడ్యూల్డ్ కులాలవారికి 20శాతం, ఇతర వెనుకబడిన కులాల వారికి 18శాతం, మరీ వెనుకబడిన వర్గాల వారికి 25శాతం రిజర్వేషన్లు కల్పించవలసి వస్తుంది. సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని నిర్మూలించడం ఎంత అవసరమో ఇతరత్రా కారణాలవల్ల అత్యంత వెనుకబాటుతనాన్ని దూరం చేయడం అంతే అవసరం.

నితీష్ వ్యాఖ్యలపై బీజేపీ నేతల హంగామా

-సుశీల్‌కుట్టి

బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ అసెంబ్లీలో మాట్లాడుతూ, మహిళలపై అనరాని వ్యాఖ్యలుచేసి ఆ వ్యాఖ్యలకు క్షమాపణలు కూడా చెప్పారు. అయితే, బహుశా ఇలా మాట్లాడటం బీజేపీ నాయకులకు అలవాటులేదని భావిస్తున్నారు. గతంలో మన దేశానికి ప్రతిష్ఠ తీసుకొచ్చిన రెజ్లర్లు తమను అవమానించిన బీజేపీ నాయకుడిపై చర్య తీసుకోవాలని కోరినప్పటికీ ఉలకలేదు, పలకలేదు. ఆనాడు బీజేపీ నాయకుడు చేసిన అరాచకపనికి ప్రధానమంత్రితో సహా ఎవ్వరూ ఏమీ పట్టించుకోలేదు. పైగా మహిళలు అనికూడా తలపెట్టకుండా పోలీసులు తమ ఇష్టంవచ్చినట్లు వేధించారు. నితీష్‌కుమార్ తప్పుచేసి క్షమాపణ కోరుకున్నారు. బీజేపీ నాయకులకు ఇలా క్షమాపణచెప్పే అలవాటుడకూడా లేదు. ఎప్పుడూ నితీష్‌పైన అసెంబ్లీ స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతూ నానా హంగామా చేస్తున్నారు. నితీష్ ఒక పుస్తకంలో ఉన్న అంశాన్ని తీసుకొని మాట్లాడారు. అయితే పుస్తకంలో ఉన్న మాటలను ఉటంకించలేదు. ఆ పుస్తకంలోఉన్న సారాంశాన్ని మాత్రమే ఆయన ప్రస్తావించారు. సెక్స్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి బోధించాలన్న ప్రతిపాదన కూడా చేస్తున్నారు. నితీష్‌కుమార్ మాట్లాడిన తర్వాత బీజేపీ ఎంఎల్‌ఏలు ఆయన ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మీడియా, ప్రతిపక్షాలు సెక్స్ విద్య గురించి మాట్లాడేందుకు పూనుకున్నారు. రెండురోజులపాటు దీనిపైనా గొడవచేశారు. టీవీ వార్తాసంస్థలు పడకగదుల్లో పురుషుల, స్త్రీల మధ్య జరిగే కార్యక్రమాన్ని ఏమీ చర్చించలేదు. పైగా నితీష్‌కుమార్ చపలచిత్తం కలవాడని, ఒక రాజకీయనేత మాట్లాడగలిగిన అంశం కాదని విమర్శించారు.

నితీష్‌కుమార్ వ్యాఖ్యలు పెద్దగా మనసుకు పట్టేవికావని, మందబుద్ధి కలవారే వీటిని పట్టించుకుంటారని కొందరు వ్యాఖ్యానించారు. పాతరోజుల్లో మాట్లాడుకునే మాటల్ని పూర్తిగా బాలికలు ఉన్న గదిలో మాట్లాడినట్లుగా అసెంబ్లీలో మాట్లాడటమేంటని మరి కొందరు ప్రశ్నించారు. సోమవారం జరిగిన శాసనసభలో ఎంఎల్‌ఏలు నితీష్ వ్యాఖ్యపై తీవ్ర గందరగోళం సృష్టించారు. నితీష్ ఒక తరగతిగదిలో ఉండి మాట్లాడలేదు. స్త్రీ, పురుషులు ఒక ఇంటిలోఉండి వ్యాఖ్యానించుకునే మాటలే ఇవి. ముఖ్యమంత్రి యధాలాపంగా చేసిన వ్యాఖ్యలేకాని, ఏదో ఆసక్తిగలిగి చేసినవి ఏమీకాదు. పైగా బీజేపీ ఎంఎల్‌ఏలు ఇవన్నీ క్రూరమైన వ్యాఖ్యలని అనడంతోపాటు తీవ్రంగా నిందించడం, మందలించడం ఆపలేదు. అలాగే నితీష్ తీవ్రమైన నేరం చేసాడని, దుర్భాషలాడాడని, మానసిక వ్యాధిగ్రస్తుడని, సెక్స్ గురించి శాసనసభ్యులకు పాఠం చెప్పాడని, ఇందుకుగాను తక్షణం క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా కార్యకర్తలు వీధుల్లో ప్రదర్శన చేశారు. ఆయన దిష్టి బొమ్మలను దగ్గం చేశారు. తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నానని, క్షమాపణ చెబుతున్నానని అసెంబ్లీలోనూ, వెలుపల మీడియాతో నితీష్ చెప్పారు. ఆయన దిష్టిబొమ్మలను దగ్దం చేశారు. ఏ చిన్న అవకాశం దొరికినా ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడేందుకు సిద్ధంగా ఉంటారు. ఇప్పుడు నితీష్‌మీద కూడా అలాగే వ్యాఖ్యానించారు. నితీష్‌కుమార్, మోదీ స్నేహితులేమీ కాదు. రాజకీయాలే ఇద్దరినీ ప్రత్యర్థులుగా నిలిపాయి. వాస్తవంగా అయితే నితీష్‌కుమార్ క్షమాపణ చెప్పవలసిన అవసరంలేదని, పుస్తకంలో ఉన్న అంశాన్నే ప్రస్తావించారని అనేకమంది నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇండియా కూటమి ఎందుకు మౌనంగా ఉందని బీజేపీ వాళ్లు ప్రశ్నిస్తున్నారు. నితీష్ వ్యాఖ్యలను ఆర్‌జేడీ, కాంగ్రెస్ ఖండించాయి. అయితే వ్యక్తులుగా ప్రియాంకగాంధీ, రాహుల్, సోనియాగాంధి తదితరులు మాట్లాడలేదు.

కొత్త ట్రిబ్యునల్ రద్దుకు సమైక్య పోరాటమే శరణ్యం!

వి. శంకరయ్య

రెండు తెలుగు రాష్ట్రాలమధ్య కృష్ణ జలాల పున:పంపిణీపై కొత్త ట్రిబ్యునల్ నియామకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్యకారకుడైతే అంది వచ్చిన అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఎన్నికల ప్రచారంకోసం వినియోగించుకున్నది. ఇద్దరూకలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలను నిస్సిగ్గుగా దెబ్బ తీశారు. కేంద్ర ప్రభుత్వానికెంత బాధ్యత వుందో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అంతకన్నా రెట్టింపు బాధ్యత వుంది. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదన వ్యతిరేకించివుంటే ఇంత కడకు వచ్చేదికాదు. దురదృష్టమేమంటే కొత్త ట్రిబ్యునల్ నియామకం వలన కలిగే తీవ్ర ఇబ్బందులు, అన్యాయం గురించి రాయలసీమ వాసులు సభలు, సమావేశాలద్వారా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుంటే కోస్తా దక్షిణాంధ్ర ప్రాంతాల్లో స్పందన కన్పించడంలేదు. వాస్తవంలో రాయలసీమకన్నా కోస్తా ప్రాంతాల నీటి కేటాయింపులకే తెలంగాణ ఎసరు పెట్టబోతోంది. కోస్తా ప్రాంతంలో వివిధ రైతు సంఘాలున్నాయి. కోస్తాలోని రైతు సంఘాలుగాని, నేతలుగాని కొత్త ట్రిబ్యునల్ నియామకంపై అవసరమైన మేరకు ప్రతిఘటన కార్యక్రమాలు చేపట్టడంలేదు. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విజయవాడలో ఈ అంశంపై రాయలసీమరైతు నేతలను కలుపుకొని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి విజయవాడలో నిరాహార దీక్షలకు పిలుపుఇవ్వడం శుభ పరిణామం. పైగా రాయలసీమ జిల్లాల్లో నిర్వహిస్తున్న నిరసన సభల్లో పాల్గొంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం జారీచేసిన కొత్త ట్రిబ్యునల్ వలన రాయలసీమ పాక్షికంగా నష్టపోయినా మొదలే నీటికోసం తపించే నేపథ్యంలో ఇది గోరుచుట్టుపై రోకటి పోటులాగా తయారౌతున్నది. పైగా రాష్ట్రంలో అంతర్గతంగా నీటి కేటాయింపులకు అడ్డంకి ఏర్పడి రాయలసీమ తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. తెలంగాణ బేసిన్ అంశం ముందుకుతెచ్చి కెసి కెనాల్ నీటికి తుంగభద్ర ఎగువ కాలువనీటికి గండి పెట్టేందుకు సిద్ధమౌతోంది. రాష్ట్ర విభజనచట్టం సెక్షన్ 89 మేరకు విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ ముందు ఈ వివాదాన్ని విచారణాంశంగా చేసివుంది. అదే సమయంలో కృష్ణడెల్టాతో పాటు దక్షిణ కోస్తాపై తీవ్రమైన దెబ్బపడే అవకాశ ముంది. ముమ్ముందు ఒకవేళ ట్రిబ్యునల్ విచారణ జరిపితే ఎలాంటి నిర్ణయం తీసుకొంటుందో ఇప్పుడే చెప్పలేం. 2004 లో నియమింపబడి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య నీటిని పంపిణీ చేసిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ గతంలో బచావత్ ట్రిబ్యునల్‌చేసి వినియోగంలోవున్న నీటి కేటాయింపుల జోలికి వెళ్లలేదు.

ప్రస్తుతం అమలులో వున్న బచావత్ ట్రిబ్యునల్ కృష్ణ డెల్టాకు 181.20 టియంసిలు కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలోనే డెల్టా ఆధునీకీకరణ కింద 29 టియంసిలు మిగులు వుంటుందని ఇందులో 20 టియంసిలు బీమా(ప్రస్తుతం తెలంగాణ)కు, 9 టియంసిలు పులిచింతలకు కేటాయించారు. ప్రస్తుతం తెలంగాణ వాదన ఏమంటే పట్టిసీమ నుండి గాని, పోలవరం నుండి గాని 80 టియంసిలు డెల్టాకు లభిస్తాయని వీటితోపాటు సాగర్‌నుండి ప్రకాశం బ్యారేజీ వరకు వంద టియంసిలు లభ్యమౌతాయి కాబట్టి ప్రస్తుతం డెల్టాలో వినియోగంలో వుండే బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 180.20 టియంసిల్లో 29 పోగా మిగిలిన 150.20 టియంసిలు బేసిన్‌లోని తన ప్రాజెక్టులకు కేటాయించాలని రాష్ట్ర విభజన నాటినుండి వివిధ వేదికలపై డిమాండ్ చేస్తోంది.

ఇన్నేళ్లు హక్కు భుక్తంగా వున్న బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులకు ఎసరు పెడుతోంది. అంటే డెల్టా రైతులు పూర్తిగా కృష్ణ జలాలు వదులుకొని గోదావరి జలాలతోపాటు సాగర్, కృష్ణ బ్యారేజీ మధ్య తెలంగాణనుండి వచ్చే చిన్న నదుల నీటిపై ఆధారపడమని చెబుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలగలసి ఇంత దుర్మార్గానికి తలపడితే ఎందుకోగాని రాయలసీమలో సాగుతున్న ఆందోళన కార్యక్రమాలు డెల్టా ప్రాంతంలో కనిపించడంలేదు. తెలంగాణ మరోవాదన ప్రబలంగా తెస్తోంది. సాగర్ కుడికాలువకు కేటాయించిన 132 టియంసిల్లో కోత విధించాలని కోరుతోంది. బేసిన్ ఆవలకు(దక్షిణ కోస్తా) కృష్ణ జలాలు తరలించుతున్నారని, అందులో కోతపెట్టి బేసిన్‌లోని తమ ప్రాజెక్టులకు కేటాయించాలనేది మరొక డిమాండ్. దుర్మార్గమేమంటే తెలంగాణ ప్రస్తుతం గోదావరిపై నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతలు (దుమ్ముగూడెం సాగర్ టెయిల్ పాండ్) లో భాగమైన సీతమ్మ సాగర్ నుండి గోదావరి జలాలను కృష్ణ బేసిన్‌లోని సాగర్ ఎడమ కాలువకు నీళ్ల తరలించుతామని తాజాగా కెసిఆర్ ప్రకటించారు. తనుమాత్రం ఒక బేసిన్‌నుండి మరో బేసిన్‌కు యదేచ్ఛగా నీళ్ల తరలించవచ్చు. కాని ఆంధ్రప్రదేశ్ మాత్రం చేయకూడదు. స్వవచన విఘాతంతో తెలంగాణ తరచూ తెరమీదకు ప్రబలంగాతెచ్చే బేసిన్ అంశంపై రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి గాని కోస్తాకు చెందిన ఒక్క అధికారపార్టీ నేత నోరు తెరిస్తే ఒట్టు. రాష్ట్రంలో ప్రతిపక్షాల నేతలపై నోరుపారేసుకుంటారు. గాని వందల ఏళ్లుగా కోస్తా రైతులు అనుభవిస్తున్న సాగునీటి హక్కులకు తెలంగాణ గండి పెట్టేందుకు సిద్ధమౌతుంటే సమయం, సందర్భంలేకుండా బూతులు మాట్లాడే ఒక్కరూ ఉలకరు, పలకరు. ముఖ్యమంత్రి మొదలుకొని వీరికందరికీ హైదరాబాద్‌లో స్థిరాస్తులున్నందున ప్రమాదం ముంచుకొస్తున్నా కెసిఆర్ కు వ్యతిరేకంగా నోరు విప్పడంలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కెసిఆర్‌తో లాలూచీ పడినందుననే 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్‌లో కొత్త ట్రిబ్యునల్ ప్రతిపాదన వ్యతిరేకించలేదు. తత్ఫలితంగా ఈ రోజు తెలంగాణలో ఎన్నికల తాయిలంగా కేంద్ర ప్రభుత్వం కొత్త ట్రిబ్యునల్ నియమించి మొత్తంగా ఆంధ్రప్రదేశ్ సాగునీటిపై చావుదెబ్బ కొట్టింది.

విశ్రాంత పాత్రికేయులు
ఫోన్ నం:848394013

పలస్తీనాను కనుమరుగు చేసే పథకం

"అమెరికా అధ్యక్షుణ్ణి మేమే ఎన్నుకుంటాం" అని ఇజ్రాయిల్ ప్రజలు చెప్పుకుంటారు. అందులో అతిశయోక్తి వున్నా కొంత వాస్తవం వుంది. అమెరికాలోని ఆయుధ కర్మాగారాలు, హాలీవుడ్ చలనచిత్ర రంగంలో ఆధిపత్య స్థానాల్లో వున్నవారు ఇజ్రాయిల్ సంతతికి చెందిన యూదులే. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆర్థిక సహాయ సహకారాలు అందించడంలో వీరి పాత్ర ప్రధానమైనది. అమెరికా విధాన నిర్ణాయక సభల్లో తమ అనుకూలురను గెలిపించటానికి వీరు మద్దతునిస్తుంటారు. మూడుశాతం జనాభాకూడా లేని వీరిపాత్ర గణనీయమైనది. ఇజ్రాయిల్‌పై గాజా ప్రాంతానికి చెందిన హమాస్ దాడి అనంతరం అమెరికా వ్యవహరిస్తున్న తీరుచూస్తుంటే ఇది స్పష్టంగా కనబడుతోంది. అడగకుండానే యుద్ధ నౌకలను, యుద్ధ వాహనాలను హడావడిగా పంపింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకన్ ఆఘమేఘాల మీద ఇజ్రాయిల్‌లో వాలారు. ఈ నెలరోజుల్లో మూడుసార్లు ఇజ్రాయిల్ పర్యటించారు. పిలవని పేరంటంగా అరబ్బు దేశాలన్ని కలియ తిరిగారు. రక్షణమంత్రి లాయిడ్ అస్టిన్ కూడా వెళ్లి వెన్నుతట్టారు. మళ్లీ పోటీకి సిద్ధంగాఉన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమన్ నెతన్యాహును ఆలింగనం చేసుకున్న అరుదైన చిత్రాన్ని పత్రికలు ప్రముఖంగా ప్రకటించాయి. ఆయన అంతటితో ఆగలేదు. నిరసన జ్వాలలతో సతమతమవుతున్న అరబ్ దేశాలను బుజ్జగించటానికి ప్రయత్నించారు. అయితే గాజా ఆసుపత్రిపై దాడిలో వందలాది మంది మృతి చెందడంతో అరబ్ దేశాధినేతలతో జరగవలసిన సమావేశం రద్దయింది. సాంప్రదాయంగా అమెరికాలోని డెమోక్రటిక్ పార్టీకి యూదులు మద్దతు తెలుపుతున్నా వారి ప్రాపకం సంపాదించటంలో రిపబ్లికన్ పార్టీ ఏ మాత్రం వెనుకబడలేదు. జెరుసలెం రాజధాని చేసినట్లయితే మద్ధతిస్తానని రిపబ్లికన్ పార్టీకి చెందిన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించటం విశేషం. ఇది పలస్తీనాను రెచ్చగొట్టడమే. ప్రస్తుత పరిస్థితుల్లో ఇజ్రాయిల్‌కు అమెరికా నైన్యెతిక మద్ధతు అవసరం. గానీ బైడెన్‌కు రాజకీయంగా ఇజ్రాయిల్ మద్దతు చాలా అవసరం. అతిగా ప్రవర్తించడం, స్పందించడం ఈ రాజకీయాల అవసరాల కోసమే. ప్రస్తుతము అక్కడ ఉన్న పరిస్థితులు దానికి దోహదపడుతున్నాయి. ఒకవేళ ఈ సమస్య పరిష్కారానికి ఇజ్రాయిల్‌పై గట్టిగా వత్తిడిచేస్తే అమెరికాలో బైడెన్‌కు రాజకీయంగా నష్టం జరిగే ప్రమాదంవుంది. వీరి పరస్పర ప్రయోజనాలు ఈ సమస్య పరిష్కారానికి ఒక అవరోధంగా మారాయి.

గాజా ప్రాంతంలోని 23 లక్షల మందిలో సగం మంది ఆహారం, నిత్యావసరాలకై విదేశీ సహాయ, సహకారాల మీద ఆధారపడవలసిన దుస్థితి. అరబ్ దేశాల ప్రజల గుండెలు భగ భగ మండుతున్నా అన్ని దేశాలు కలిసినా ఇజ్రాయిల్‌ను నిలువరించలేని నిస్సహాయక స్థితి. అంత ఆయుధ సంపత్తి, సైనిక సామర్థ్యం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, నిఘా వ్యవస్థ ఇజ్రాయిల్ కలిగివుంది. 1967లో అరబ్‌దేశాల ఐక్య సంఘటన చేసిన యుద్ధం ఆరురోజులు మించి సాగలేదు. ఈజిప్టు, సిరియా, జోర్డాన్లు కలసిచేసిన ఈ యుద్ధంలో పలస్తీనాలోని గాజా, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాలు, జెరుసలెంతో పాటు ఇజ్రాయిల్ వశమయ్యాయి. సిరియా తన గోలాన్ పర్వత ప్రాంతాలు కూడా కోల్పోయింది.

శాంతి సామరస్య స్థాపనకు ఏర్పడిన ఐక్యరాజ్య సమితి(ఐరాస) లాటి అంతర్జాతీయ సంస్థలు అమెరికా లాంటి దేశాల ఒత్తిడులకు, ప్రభావాలకు లోనై తమ విధులు సక్రమంగా నిర్వర్తించకుంటే జరిగే అనర్ధాలు ఎలా ఉంటాయో తెలపటానికి ఈ ఘర్షణలే నిదర్శనం. 194లో ఇజ్రాయిల్ ఒక దేశంగా ఏర్పడిన నాటి నుండి పలస్తీనాను అణగదొక్కటానికి ప్రయత్నం చేస్తూనే ఉంది. ఆ సమయంలో ఐరాస చేసిన తీర్మానమే దీనికి విషబీజం నాటింది. పలస్తీనియులు మనోభావాలను అది ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోలేదు. తమ భూభాగాన్ని విభజించటానికి అంగీకరించని పరిస్థితుల్లో కనీసం జనాభా ప్రాతిపదికగాని, మరే ఇతర ప్రమాణాలుగాని పాటించకుండా మూడు భాగాలు చేసింది. పలస్తీనాకు గాజా, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాలు మాత్రమే దక్కాయి. జెరుసలెం మినహా మిగిలిన ప్రాంతమంతా ఇజ్రాయిల్‌కు అప్పగించింది. అన్ని మతాల ప్రార్థనా స్థలాలున్న జెరుసలెంను తన పర్యవేక్షణలో ప్రత్యేకపాలనా యంత్రాంగానికి ఇచ్చింది. 33శాతం జనాభావున్న యూదులకు 62శాతం భూబాగం అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ ఆ సమావేశాన్ని పలస్తీనీయులు బహిష్కరించారు. అప్పటినుండి ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే వుంది. భారత్‌తో వివిధ దేశాలు తొలుత ఇజ్రాయిల్‌ను గుర్తించలేదు.

1967వ సంవత్సరంలో ఇజ్రాయిల్ ఆక్రమించుకున్న వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం పలస్తీనా విమోచన యోధుడు యాసర్ అరఫాత్ నాయకత్వంలో జరిగిన పోరాటాల ఫలితంగా 1994వ సంవ్సరంలో తిరిగి పలస్తీనాకు దక్కింది. గాజా ప్రాంతం 2005 వరకు ఇజ్రాయిల్ దురాక్రమణలోనే ఉంది. ఈ కాలంలో తమ సైనిక రక్షణ బలగాల సహాయంతో గాజా, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాల్లో యూదులు స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. ఒక పథకం ప్రకారం నేటికీ ఈ అక్రమణలు కొనసాగుతున్నాయి. ఫలితంగా పలస్తీనా భూభాగం మరింత కుచించుకుపోయింది. జెరుసలెం ఇంకా ఇజ్రాయెల్ చేతుల్లోనే వుంది. అక్కడ ప్రార్థనా మందిరం దర్శించటానికి కూడా పలస్తీనియులపై ఆంక్షలు విధిస్తూ వుంది. వారు నివసించే భూభాగాల్లో సైతం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించివేసింది. ఈ పరిస్థితుల్లోనే హమాస్, అల్‌జిహాద్ సాయుధ దళాలు పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిలో 10వేల మంది వరకు మృతిచెందారు. మరో 30వేలమంది గాయపడ్డారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. గాజాలో సగభాగం స్మశానవాటికగా మారింది. మానవతా దృక్పధంతో కాల్పుల విరమణకు ఐరాస ఇటీవల ప్రవేశపెట్టిన తీర్మానాన్ని 120 దేశాలు ఆమోదించగా, కేవలం 14 దేశాలు వ్యతిరేకించాయి. మనదేశం ఓటింగ్‌లో పాల్గొనలేదు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరకాలంగా వున్న పలస్తీనా అనుకూల వైఖరిలో మార్పు స్పష్టంగా కనబడుతోంది. 2017వ సంవత్సరంలో ఇజ్రాయిల్ పర్యటించిన తొలి భారత్ ప్రధానిగా మోది ఖ్యాతి గడించారు. ఆ తరువాత ఇటీవల అదాని అక్కడ పోర్టు కొనుగోలు చేశారు.

ఇజ్రాయిల్ కోటి జనాభా కూడా లేని ఒక చిన్న దేశం. ఎనిమిది దశాబ్దాల చరిత్రకూడా లేని దేశం. ఈ కాలంలో దాని దురాగతాలు ప్రత్యక్ష దృశ్యాలుగా స్పష్టంగా కనబడుతున్నాయి. చరిత్ర వక్రీకరించటానికి ఇది అశోకుని కాలం నాటిదో, ఔరంగజేబు కాలం నాటి చరిత్ర కాదు. ప్రపంచపటం నుండి పలస్తీనాను కనుమరుగు చేయడానికి పథకం ప్రకారం పన్నుతున్న వ్యూహం. ఇకనైనా ప్రపంచ ప్రజాగ్రహాన్ని మన్నించి ఆక్రమణల నుండి వైదొలగడమే దీనికి పరిష్కారం. దానికి చిత్తశుద్ధి అవసరం. ప్రస్తుతం అది లోపించింది.

ఎస్.జి.కె

మతమా...అభివృద్ధా?

పోక్రాన్‌లో ఆసక్తికర పోరు

పోకరన్ (రాజస్తాన్): రాజస్తాన్‌లోని పోక్రాన్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఇక్కడ ఓ హిందూమత నాయకుడు బీజేపీ తరుపున పోటీ చేస్తుండగా...ఆయనపై ముస్లిం మత నాయకుడి తనయుడు సలే మొహమ్మద్ కాంగ్రెస్ టికెట్‌పై రంగంలో దిగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మొహమ్మద్ కేవలం 872 ఓట్ల తేడాతోనే విజయం సాధించారు. ఇక్కడ ప్రభుత్వ వ్యతిరేకత లేదని, తన అభివృద్ధి పనులు చూసి ప్రజలు ఓటేస్తారని, మత ప్రాతిపదికన ఎవరూ ఓటేయరని ఆయన స్పష్టంచేశారు. 'ఈసారి ఎన్నికలు అభివృద్ధి అజెండాగానే జరుగుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతమైన అభివృద్ధి పనులు చేసింది. ఇక్కడ మతమనేది సమస్యే కాదు. ఈ ఎన్నికల్లో హిందూ-ముస్లిం అనే తేడా కనిపించడం లేదు' అని మొహమ్మద్ మంగళవారం పీటీఐతో మాట్లాడుతూ చెప్పారు. తనపైన గానీ, ప్రభుత్వంపైన గానీ ఎలాంటి వ్యతిరేకత లేదని, బీజేపీ అగ్రనాయకులు నియోజకవర్గంలో ప్రచారానికి వస్తారని, మత ప్రాతిపదికనే ప్రసంగాలు చేస్తారని, అయినా అది ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపే అవకాశం లేదని మైనారిటీ వ్యవహారాల మంత్రి కూడా అయిన మొహమ్మద్ చెప్పారు. బీజేపీ తరపున స్వామి ప్రతాప్ పురి పోటీ చేస్తున్నారు. ప్రజలను ఆకర్షించడం కోసమే ఎన్నికల ముందు అభివృద్ధి పనులంటూ కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటుందని పురి విమర్శించారు. గడచిన ఐదేళ్లుగా తాను ప్రజలతో నిత్య సంబంధాలు కొనసాగిస్తున్నానని, కాంగ్రెస్ కేవలం అభివృద్ధి గురించి అసత్యాలు ప్రచారం చేస్తోందని, అయితే, అందులో ఎక్కువ ప్రకటనలకే పరిమితమయ్యాయని పురి ఆరోపించారు. ప్రజలను ఆకర్షించడానికి మాత్రమే ఎన్నికల ముందు అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పుకుంటుందని అభిప్రాయపడ్డారు. కేంద్రంతో పోలిస్తే ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనులేమీ లేవని ఆయన పీటీఐతో మాట్లాడుతూ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభిస్తుందని, కానీ అవి పూర్తవుతాయన్న నమ్మకం లేదని చెప్పారు. పురి, మొహమ్మద్ ఇద్దరూ తమ సామాజికవర్గాలపై వరాల జల్లు కురిపిస్తున్నారు. పురి రాజ్‌పుత్ వర్గానికి చెందిన వాడు. బర్మర్ జిల్లాలోని తారాతర మఠానికి చెందిన మత నాయకుడు. తన తండ్రి గాజీ ఫకీర్ మృతితో పీర్ పగారో అనే మత సంస్థకు మొహమ్మద్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పోక్రాన్ అసెంబ్లీ నియోజకవర్గం సరిహద్దు జిల్లా జైల్మీర్‌లో ఉంది. 2.22 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అత్యధికులు ముస్లింలు లేదా రాజ్‌పుత్‌లు. నియోజకవర్గంలో 60 వేలమంది ముస్లింలు. 40 వేలమంది రాజ్‌పుత్‌లు, 35 వేలమంది ఎస్సీ, ఎస్టీలు, 10 వేలమంది జాట్‌లు, 6 వేలమంది విష్ణోయ్‌లు, 5000 వేలమంది మాలా, 3 వేల మంది బ్రాహ్మణులు ఉన్నారు. అభ్యర్థులు ఇద్దరూ తమ మతపరమైన ఓటుబ్యాంకుపై ఆధారాపడ్డారు. ఇతర కులాల మద్దతుపై వారి విజయం ఆధారపడి ఉంది. స్థానిక సమస్యలు, నియోజకవర్గ ప్రజలతో నాయకుల వ్యక్తిగత సంబంధాలు కూడా విజయావకాశాలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అంటున్నారు. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిస్సందేహంగా జరిగాయని, అయితే, తన సొంత ప్రజలపై ఎమ్మెల్యే దృష్టి సారించలేదన్న అభిప్రాయం ఉందని పోకరాన్ వాసి జకీర్ ఖాన్ చెప్పారు.

మణిపూర్‌లో 13 వరకు మొబైల్ ఇంటర్నెట్ నిషేధం

ఇంఫాల్ : మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొబైల్ ఇంటర్నెట్ నిషేధాన్ని నవంబరు 13వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు మణిపూర్ ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల జరిగిన కాల్పుల్లో 10 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బిష్ణూపూర్, ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాంగ్‌పోక్పి జిల్లాలో రెండు కమ్యూనిటీల మధ్య కాల్పులు జరుగుతున్నాయని మణిపూర్ డీజీపీ వెల్లడించారు. మరో ఇద్దరు వ్యక్తులు అదృశమయ్యారని, నలుగురు వ్యక్తులను గుర్తు తెలియని దుండగులు అపహరించారని తెలిపారు. దీంతో అక్కడ నిరసనలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. హింసను ప్రేరేపించే చిత్రాలు, ద్వేషపూరిత ప్రసంగాలు, వీడియోలను వ్యతిరేక వ్యక్తులు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసే అవకాశం ఉందని, దాంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని, అందుకే మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధం పొడిగించినట్లు తెలిపారు.

పెన్షనర్లకు మూడో విడత బకాయి: రాజ్‌నాథ్‌సింగ్



న్యూఢిల్లీ: వన్ ర్యాంక్...వన్ పెన్షన్ పథకం కింద రక్షణ రంగ పెన్షనర్లకు దీపావళికి ముందే మూడో విడత బకాయిలు విడుదల చేయాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం ఆదేశించారు. వన్ ర్యాంక్...వన్ పథకం కింద సాయుధ దళాల సిబ్బంది పెన్షన్ సవరణకు ప్రభుత్వం గత డిసెంబరులోనే ఆమోదం తెలిపింది. 2019 జులై 1 నుంచి ఇది అమలులోకి వస్తుందని ఆనాడే ప్రకటించింది. బకాయిలను నాలుగు విడతల్లో అందజేస్తామని చెప్పింది. తాజాగా దీపావళి సందర్భంగా మూడో విడత బకాయిలు విడుదల చేయాలని రాజ్‌నాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని రాజ్‌నాథ్‌సింగ్ కార్యాలయం ఎక్స్ వేదికగా ప్రకటించింది. రక్షణ రంగ పెన్షనర్లు అందరికీ బకాయిలు చెల్లించాలని బ్యాంకులు, ఇతర సంస్థలను కూడా ఆదేశించినట్లు తెలిపింది.

23ఏళ్ల నాటి కేసులో సుర్జేవాలాకు ఊరట

న్యూఢిల్లీ: 23 ఏళ్ల నాటి క్రిమినల్ కేసుకు సంబంధించి వారణాసి ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యు)నుంచి కాంగ్రెస్ నేత రణదీప్ సింగ్ సుర్జేవాలాకు సుప్రీంకోర్టు గురువారం రక్షణ కల్పించింది. ఐదు వారాల్లోగా ఎన్‌బీడబ్ల్యు రద్దు కోసం ప్రత్యేక న్యాయమూర్తి (ఎంపి/ఎమ్మెల్యే) వారణాసి కోర్టును ఆశ్రయించాలని సుర్జేవాలాను ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. 'ఎన్‌బీడబ్ల్యూ రద్దు కోసం పిటిషన్‌ను బదిలీ చేయడానికి పిటిషనర్‌కు స్వేచ్ఛ ఇవ్వబడింది. వారెంట్ ఐదు వారాల వరకు అమలు చేయబడదు' అని న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సుర్జేవాలా తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి అత్యవసర విచారణను కోరుతూ ఉదయం ఈ అంశాన్ని ప్రస్తావించడంతో కోర్టు విచారణకు అంగీకరించింది. ఈ కేసు 2000 నాటిది. అప్పటి భారత యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న సూర్జేవాలా... వారణాసిలోని సంవాసిని కుంభకోణంలో కాంగ్రెస్ నాయకులను ఇరికించడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన నిరసనలో గలాటా సృష్టించారన్న ఆరోపణపై ఈ కేసు నమోదైంది.

అసంతృప్తులను బుజ్జగిస్తా: శివకుమార్

బెంగళూరు: పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో నిత్యం అల్పాహార సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు వినాలని నిర్ణయించినట్లు కర్నాటక ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ గురువారం తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కొంతమంది ఎమ్మెల్యేలు ,పార్టీ సీనియర్ కార్యకర్తల్లో చెలరేగుతున్న అసంతృప్తిని అరికట్టడం, వారిని బుజ్జగించడంలో ఇదొక భాగమని పేర్కొన్నారు. 'ఎమ్మెల్యేలందరికీ సమయం విషయంలో గందరగోళం ఉంది. ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు (ఎమ్మెల్యేలకు) టైం ఫిక్స్ చేశాను. మా పార్టీ కార్యకర్తల కోసం కూడా నేను సమయాన్ని నిర్ణయిస్తున్నాను' అని శివకుమార్ విలేకరులకు చెప్పారు. ఎమ్మెల్యేల నియోజక వర్గాల్లో అభివృద్ధి పనులతోపాటు వారి ఫిర్యాదులను వినడం, పరిష్కరించడం లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాను బెంగళూరుకు వెళ్లే రోజుల్లో తప్ప ప్రతిరోజూ ఈ సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు.

ఎన్‌ఈపీ అమలులో సమస్యల్ని పరిష్కరిస్తాం

కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి అన్నపూర్ణాదేవి యాదవ్

కోహిమా: జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) అమలుకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణా దేవి యాదవ్ తెలిపారు. నాగాలాండ్‌లో తన రెండు రోజుల పర్యటన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పిల్లలకు వారి మాతృభాషలో బోధించినట్లయితే ఇతర భాషల్లో వారికి బోధించే విషయాలను బాగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. అదే ఎన్‌ఈపీ చెబుతోందన్నారు. ఆరు నుంచి వృత్తి విద్యా కోర్సులుండాలని ఎన్‌ఈపీ స్పష్టం చేస్తోందని, తద్వారా గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఇతర కోర్సులను చేపట్టడంలో ఇది సౌలభ్యాన్ని అందిస్తుందన్నారు. అలాగే పరిశోధన పనులను సులభతరం చేస్తుందని ఆమె చెప్పారు. ఈశాన్య ప్రాంతాన్ని ప్రస్తావిస్తూ, కేంద్రం నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ ప్రాంత సమగ్రాభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల తర్వాత ఈ ప్రాంతాన్ని మరచిపోయేదని... అలా కాకుండా ప్రధాని ఈ ప్రాంతానికి అనేక పథకాలు, ప్రత్యేక ప్యాకేజీలను పొడిగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి, ఈ ప్రాంత ప్రజల సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని బీజేపీ-ఎన్‌డీపీపీ సంకీర్ణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను అమలు చేయడంపై యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. తన పర్యటన సందర్భంగా అన్నపూర్ణా దేవి త్సెమినియు జిల్లాకు వెళ్లి అక్కడ అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలను సమీక్షించారు. ఆమె చున్లిఖాలోని ఒక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా సందర్శించారు. జిల్లా అధికారులు, పౌర సంఘాలు, విద్యార్థి సంఘం, గ్రామ కౌన్సిల్ చైర్మన్ల ఫోరంతో సంభాషించారు. పాఠశాల విద్యాశాఖలో సిబ్బంది కొరత, జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.

మహిళా రోగిపై మూత్ర విసర్జన వ్యక్తి అరెస్ట్

లక్నో: ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళా రోగిపై ఒక వ్యక్తి మూత్ర విసర్జన చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆమెను అసభ్యపదజాలంతో తిట్టాడు. మహిళా రోగి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. సుఖ్‌పురా గ్రామానికి చెందిన ఒక మహిళ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి ఒక వ్యక్తి ఆ ఆసుపత్రిలోకి వచ్చాడు. ఒక వార్డులోని బెడ్‌పై పడుకున్న మహిళా రోగిపై మూత్ర విసర్జన చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆమెను అసభ్య పదజాలంతో తిట్టి అక్కడి నుంచి పారిపోయాడు. బాధిత మహిళా రోగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి నిందితుడి కోసం వెతికారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళపై మూత్ర విసర్జన చేసిన వ్యక్తిని వికాస్ సింగ్‌గా గుర్తించారు. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కేరళ సచివాలయానికి బాంబు బెదిరింపు

తిరువనంతపురం: కేరళ సచివాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సెక్రటేరియట్‌లోని సిబ్బందిని బయటకు పంపారు. పోలీసు సునకాల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సచివాలయ ఆవరణలో అమర్చిన పేలుడు పదార్థాలను పేల్చేస్తామంటూ ఆ రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు గురువారం ఉదయం బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో పోలీసులు వెంటనే స్పందించారు. శునకాల సహాయంతో సచివాలయం ఆవరణ, వెలుపల క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. పార్కింగ్ ప్రాంతంలోని వాహనాలతోపాటు సమీపంలో ఉన్న దుకాణాలను కూడా తనిఖీ చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. కాగా, బాంబు బెదిరింపు ఫేక్ అని తనిఖీల తర్వాత పోలీసులు నిర్ధారించారు. ఫోన్ కాల్ చేసిన నిందితుడిని గుర్తించడంతోపాటు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగా లేనట్లు తెలుస్తున్నదని చెప్పారు. ఈ ఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సచివాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినట్లు వివరించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ వైద్యుడి పోటీ

ఓటమి చెందితే తిరిగి విధుల్లోకి: హైకోర్టు

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రభుత్వ వైద్యుడికి హైకోర్టు అనుమతిచ్చింది. ఒకవేళ ఎన్నికల్లో విజయం సాధించకపోతే తిరిగి విధుల్లో చేరవచ్చని స్పష్టం చేసింది. దుంగార్పూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారతీయ ట్రైబల్ పార్టీ(బీటీపీ) తరపున దీపక్ గోఘ్రూ(43) పోటీ చేస్తున్నారు. బీటీపీ రాష్ట్ర అధ్యక్షుడు వెలరం గోఘ్రూ తనయుడే దీపక్ గోఘ్రూ. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనేందుకు, పోటీ చేయడానికి దీపక్ గోఘ్రూకు అనుమతివ్వాలని, మెడికల్ అధికారిగా పనిచేస్తున్న దీపక్‌ను రిలీవ్ చేయాలని హైకోర్టు జోధ్‌పూర్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ పుష్పేంద్రసింగ్ భట్టి అక్టోబరు 20న ఆదేశాలు జారీ చేశారు. దీనితోపాటు ఒకవేళ దీపక్ ఎన్నికల్లో ఓటమి చెందితే...తిరిగి ఆయనను మెడికల్ అధికారిగా విధుల్లోకి తీసుకోవాలని స్పష్టంచేశారు. దీనిపై దీపక్ స్పందిస్తూ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రభుత్వ డాక్టరుకు హైకోర్టు అనుమతించడం రాష్ట్రంలో ఇదే మొదటిసారని, పోటీ చేయడమే కాకుండా ఓటమి చెందితే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించడం ఎన్నడూ జరగలేదని చెప్పారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎన్నికల్లో పోటీకి ఇది ఆదర్శంగా ఉంటుందని దుంగార్పూర్ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న డా.దీపక్ పీటీఐకి చెప్పారు. పదేళ్లుగా దుంగార్పూర్‌లో తాను విధులు నిర్వహిస్తున్నానని, స్థానిక ప్రజలకు తాను బాగా తెలుసని, ఎన్నికల్లో గెలుస్తానన్న విశ్వాసం ఉందని ఆయన చెప్పారు. విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలని, ప్రజలకు సేవలందించాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో పోటీ చేయాలన్న తన నిర్ణయాన్ని ప్రజలు స్వాగతించారని, ప్రజలతో తనకు నేరుగా సంబంధాలు ఉండటంతో విజయంపై నమ్మకం ఉందన్నారు. దుంగార్పూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి బన్సీలాల్ కతారా, కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గణేశ్ గోఘ్రూ పోటీ చేస్తున్నారు.

మహారాష్ట్రలో రిజర్వేషన్ల చిచ్చు

మరాఠాలకు ఇస్తే ఆందోళన.. ఓబీసీల హెచ్చరిక

వచ్చే నెల 24లోగా ఇవ్వాల్సిందే: మనోజ్ జరాంగే

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఓబీసీ రిజర్వేషన్లు రెండు వర్గాల మధ్య చిచ్చుకు దారి తీస్తున్నాయి. ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలన్న మరాఠాల ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గి వారిని ఓబీసీల్లో చేర్చడానికి ప్రయత్నిస్తుండగా, దానిపై ఓబీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరాఠాలను ఓబీసీ కేటగిరీలో చేరిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు. మరాఠాలకు కుంబీ కుల సర్టిఫికెట్ జారీ చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదిస్తే తాము కోర్టులను ఆశ్రయించడమే కాక ఆందోళనలు నిర్వహిస్తామని ఓబీసీలు ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తేవడానికి రాష్ట్రంలోని వివిధ ఓబీసీ గ్రూపుల వారు ఏకతాటిపై నిలిచి రానున్న 20 రోజుల్లో మూడు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించాయి. ఒక పక్క మరాఠాలకు రిజర్వేషన్లు వద్దంటూ ఓబీసీలు ఒత్తిడి చేస్తుండగా, డిసెంబర్ 24లోగా మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనంటూ మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జరాంగే బుధవారం హెచ్చరించారు. మరాఠాలకు రిజర్వేషన్ల అంశంపై గతంలో మరాఠా నేతలే సహకరించేవారు కాదని, రిజర్వేషన్లు వద్దంటూ వారే గత 30-40 ఏళ్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి కూడా తెచ్చారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం డిసెంబర్ 24లోగా రిజర్వేషన్లు కల్పించకపోతే రిజర్వేషన్లను అడ్డుకున్న మరాఠా నేతల పేర్లన్నింటినీ బయటపెడతాని హెచ్చరించారు.

నితీశ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

నిర్మలా సీతారామన్ ఆరోపణ

భోపాల్: మహిళలపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉన్నాయని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. జనాభా నియంత్రణకుగాను మహిళలకు విద్య ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ...భార్యాభర్తల శారీరక సంబంధం విషయంలో భర్తను విద్యావంతురాలైన భార్య చాలా వరకు నియంత్రణలో ఉంచగలదని నితీశ్‌కుమార్ మంగళవారం అసెంబ్లీలో చెప్పారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి. దీంతో నితీశ్ తన వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతూ బుధవారం ఉభయసభల్లోనూ, బయట ప్రకటన చేశారు. నిర్మలా సీతారామన్ గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ నితీశ్ వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతిపక్ష కూటమి ఇండియా మనస్తత్వాన్ని నితీశ్ వ్యాఖ్యలు ప్రతిబింబించాయని ఆమె అన్నారు. మహిళలను ప్రతిపక్ష కూటమి కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని ఆరోపించారు. 'అది సిగ్గుపడే ప్రకటన. సీనియర్ రాజకీయవేత్త, ముఖ్యమంత్రి అసెంబ్లీలో నీచమైన భాష ప్రయోగించారు. అది కూడా మహిళల విద్య, ఆరోగ్యం సందర్భంగా ఆ భాష ఉపయోగించడం దారుణం' అని ఆమె అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా వ్యవహారంపై విలేకరులు ప్రశ్నించగా తన కేసు గురించి లోక్‌సభ నైతిక విలువల కమిటీ ముందు చెప్పుకునే అవకాశం కల్పించారని, కానీ ఆమె ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నారా అని నిర్మలా సీతారామన్ ఎదురు ప్రశ్నించారు. మొయిత్రాపై ఆరోపణలు పార్లమెంటరీ వ్యవస్థకు సంబంధించినవని చెప్పారు.

కాంగ్రెస్‌కు వందేళ్లు అధికారం దూరం చేయాలి: మోదీ

ఛతర్‌పూర్: దేశాభివృద్ధిని తిరోగమనంలో నడిపించడంలో మంచి నైపుణ్యం కలిగిన కాంగ్రెస్ పార్టీని కనీసం వంద ఏళ్లపాటు అధికారాన్ని దూరం చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. నవంబర్ 17న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో జరిగిన సభలో ప్రధాని ప్రసంగిస్తూ... కాంగ్రెస్ ఉచ్చు లో పడవద్దని ప్రజలను హెచ్చరించారు. సుపరిపాలనను చెడ్డదిగా మార్చడంలో కాంగ్రెస్‌కు ఎంతో నైపుణ్యం ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా 100 ఏళ్ల క్రితం సుసంపన్నమైన జలవనరుల వారసత్వం ఉన్న బుందేల్‌ఖండ్‌లో నీటి కొరత తీర్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. చాలాకాలం పాటు చుక్క నీటి కోసం అక్కడి ప్రజలు యాచించారని మోదీ అన్నారు. అందుకే కనీసం 100 ఏళ్లపాటు అధికారాన్ని లేకుండా చేయడం ద్వారా కాంగ్రెస్‌ను కూడా యాచించేలా చేయాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్‌కు సొంత ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలు పట్టవన్నారు. కాంగ్రెస్ నేతలు నోటిలో వెండి చెంచా పెట్టుకుని పుట్టారని, వారికి పేదరికాన్ని ఎగతాళి చేయడమే 'అడ్వెంచర్ టూరిజం' అని మోదీ అన్నారు. కాంగ్రెస్‌కు దేశం మొత్తం దిల్లీతో మొదలై దానితోనే ముగుస్తుంది. కాంగ్రెస్ నాయకులు తమ విదేశీ స్నేహితులను దిల్లీ వెలుపలికి తీసుకెళ్లినప్పుడల్లా మురికివాడలలో పేదరికం చూపించడానికి వారితో ఫోటో సెషన్లు నిర్వహించారని మోదీ అన్నారు. అయితే నేడు మోదీ వారికి పక్కా ఇళ్లు ఇస్తున్నారని ప్రధాని చెప్పుకొచ్చారు.

రెజ్లర్ బజరంగ్ పునియాకు బెయిల్

న్యూఢిల్లీ: పరువు నష్టం కేసులో భారత అగ్రశ్రేణి రెజ్లర్ బజరంగ్ పునియాకు బెయిల్ లభించింది. కొన్ని నెలల క్రితం డబ్ల్యుఎఫ్‌ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరన్ సింగ్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా తన ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా పునియా వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తూ పాటియాలా కోచ్ నరేశ్ దహియా దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో దిల్లీ కోర్టు గురువారం పునియాకు బెయిల్ మంజూరు చేసింది. దహియా అత్యాచార కేసు ఎదుర్కొంటున్నందున తమ నిరసనను వ్యతిరేకించే విశ్వసనీయత అతనికి లేదని రెజ్లర్ల నిరసన సందర్భంగా బజరంగ్ వ్యాఖ్యానించాడు. దీనిపై దహియా కోర్టులో పిటిషన్ వేయడంతో బజరంగ్‌కు సమన్లు అందాయి. బజరంగ్ ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో పతకం లేకుండానే వెనుదిరిగాడు. 'భజరంగ్ భౌతికంగా కోర్టు హాజరు నుండి మినహాయింపు కోరాడు. మొదటి మూడు విచారణలకు దూరమయ్యాడు. అతను ఈ రోజు భౌతికంగా హాజరయ్యాడు. కోర్టు అతనికి బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణ మార్చి 5న జరుగుతుంది' అని దహియా తరపున వాదించిన న్యాయవాది రాజేష్ కుమార్ రెక్స్‌వాల్ పీటీఐకి చెప్పారు. అత్యాచారం కేసులో తాను నిర్దోషిగా విడుదలయ్యానని, బజరంగ్ వ్యాఖ్యలు తన ప్రతిష్ఠను దెబ్బతీశాయని కోర్టులో దహియా న్యాయవాది వాదించారు. రెజ్లర్లు బజరంగ్, వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా నిరసనకు నాయకత్వం వహించారు. బ్రిజ్‌భూషణ్ అనేక మంది మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రస్తుతం కోర్టు కేసు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ అవన్నీ అవాస్తవాలని తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే.

ప్రముఖ మలయాళ నటుడు కళాభవన్ హనీఫ్ కన్నుమూత

కొచ్చి: ప్రముఖ మలయాళ సినీ నటుడు, మిమిక్రీ కళాకారుడు కళాభవన్ హనీఫ్ (63) కన్నుమూశారు. శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన... కొచ్చిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఆయన తుదిశ్వాస విడిచారు. ఎర్నాకులంలోని మట్టంచెరికి చెందిన కళాభవన్ హనీఫ్ 150కు పైగా చిత్రాల్లో హాస్య నటుడిగా నటించారు. విద్యాభ్యాసం తర్వాత సేల్స్‌మెన్‌గా కెరీర్ ఆరంభించిన ఆయన.. నాటకరంగంలో చురుకుగా ఉండేవారు. కళాభవన్ బృందంలో ప్రధాన మిమిక్రీ కళాకారుడిగా పనిచేశారు. నాటకరంగంతో ప్రారంభమైన ఆయన కళాప్రస్థానం.. కళాభవన్ వరకు చేరుకుంది. అనేక సూపర్ హిట్ సినిమాలతో పాటు అనేక షోలలో తన హాస్యంతో ప్రేక్షకులను నవ్వించారు. మిమిక్రీ ద్వారా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు హనీఫ్. 'చెప్పు కిలుక్కన చంగతి' సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు. పరక్కుం తాలికా చిత్రంలో వరుడి పాత్రతో సహా అనేక ఇతర హాస్య పాత్రలతో మెప్పించారు. ఇప్పటికే 150కి పైగా సినిమాల్లో నటించారు. ఈ ఏడాది విడుదలైన జలధార పంప్ సెట్ ఆయన చివరి చిత్రం. శుక్రవారం మట్టంచెరిలో హనీఫ్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయనకు భార్య వహీదా,ఇద్దరు పిల్లలు షరూఖ్ హనీఫ్, సితార హనీఫ్ ఉన్నారు. షరూక్ ఈ ఏడాది ప్రారంభంలో పెళ్లి చేసుకున్నారు. అతని వివాహానికి మాలీవుడ్ నుంచి అనేకమంది సినీ ప్రముఖులు హాజరయ్యారు. కళాభవన్ హనీఫ్ హఠాన్మరణంతో మాలీవుడ్ విషాదంలో మునిగిపోయింది. ఆయన అభిమానులు, సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ఆయన మరణానికి సంతాపం తెలుపుతూ... కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇస్తున్నారు. హనీఫ్ ఆత్మకు శాంతి చేకూరాలని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.

బీజేపీ కక్ష సాధింపు రాజకీయాలు

- పొంగులేటి ఇంటిపై సీబీఐ, ఈడీ దాడులు అప్రజాస్వామికం
- ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థిపై బీజేపీ దాడి దారుణం
- కేంద్రం మద్దతుతోనే చంద్రబాబు జైలుకు
- 'ఇండియా'ను చూసి బీజేపీ నేతలకు గుబులు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ

విశాలాంధ్ర-గూడూరు:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలలో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తీవ్రంగా విమర్శించారు. గూడూరులోని ఆషిక్ గ్రాండ్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో కలిసి సీపీఐ, సీపీఎం పోటీ చేస్తున్నాయన్నారు. కొత్తగూడెం సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివ రావుకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. దీంతో తెలంగాణ ప్రభుత్వంతో కుమ్మక్కై తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పాలేరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాసరెడ్డి ఇంటిపై సీబీఐ, ఈడీతో దాడులు చేయించి ఇళ్లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మోదీ, అమిత్‌షా సహకారం లేకుండా మూడుసార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబును జైలుకు పంపించలేరన్నారు. రూ.70 వేల కోట్ల అక్రమ ఆస్తుల ఆరోపణలు ఎదుర్కొంటూ 13 కేసులతో రాష్ట్రానికి సీఎంగా కొనసాగుతూ సుదీర్ఘకాలం బెయిల్‌పై ఉన్న ఏకైక వ్యక్తి జగన్ అన్నారు. రాజకీయాలలో విమర్శలు, విభేదాలు సర్వసాధారణమని, కానీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని నారాయణ హితవు పలికారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలపై యథేచ్ఛగా దాడులు కొనసాగుతున్నాయన్నారు. బీజేపీయేతర రాష్ట్రాలలో గవర్నర్లను అడ్డుపెట్టుకొని ప్రభుత్వాల అస్థిరతకు కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను దాడులకు ఉసిగొల్పడం బీజేపీ కుటిల రాజకీయానికి నిదర్శమని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సిసోడియాను మద్యం కుంభకోణం కేసులో జైలుకు పంపించారని, అదే కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. నెల్లూరులో ప్రారంభమైన మద్యం కుంభకోణం హైదరాబాద్‌కు చేరిందని, వైసీపీ నాయకులకే మద్యం తయారీ కంపెనీలున్నాయని తెలిపారు. ఈ కుంభకోణంలో కీలకపాత్ర వైసీపీ, బీఆర్ఎస్ నాయకులదేనని విమర్శించారు. అయితే ఆ రెండు పార్టీలు బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తుండటంతో మద్యం కుంభకోణం దిల్లీకి చేరిందన్నారు. బీజేపీని వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలను తొక్కివేయడమే కేంద్ర పాలకుల లక్ష్యంగా ఉందన్నారు. బీజేపీ తదుపరి లక్ష్యం వైసీపీయేనని నారాయణ చెప్పారు. ఈ విషయాన్ని సీఎం జగన్ గుర్తించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నట్లు తెలంగాణ ప్రజలు తెలుసుకున్నారన్నారు. దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన ప్రతిపక్ష ఇండియా కూటమి రోజురోజుకూ పుంజుకుంటోందని, దీంతో బీజేపీ పాలకుల గుండెల్లో గుబులు పట్టుకుని దేశవ్యాప్తంగా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. బీజేపీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంతో బీఆర్ఎస్ ఓటమి ఖాయమని, ఎన్నికల తర్వాత ఆ పార్టీకి వీఆర్ఎస్ తప్పదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలకుల్లో అహంభావం, అహంకారం, నిరంకుశ వైఖరి తారస్థాయికి చేరిందని మండిపడ్డారు. తెలంగాణలో ఆ పార్టీ పతనం ప్రారంభమైందన్నారు. అనంతరం మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి జి.రమేశ్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు మురళి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

భారత కార్మికుల్ని ఇజ్రాయిల్‌కు పంపవద్దు

- వారి ప్రాణాలకు ముప్పు రానివ్వొద్దు
- ప్రధాని మోదీకి సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం లేఖ

న్యూదిల్లీ:

భారతీయ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపవద్దని, వారి ప్రాణాలకు హాని తలపెట్టవద్దని కోరుతూ ప్రధాని మోదీకి సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం గురు వారం లేఖ రాశారు. పలస్తీనా కార్మికుల స్థానాన్ని భారతీయు లతో భర్తీ చేసేందుకు ఇజ్రాయిల్, భారత్ యంత్రాంగాల కసరత్తు ఆక్షేపణీయమన్నారు. దీనిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. యుద్ధ జోన్‌లోకి భారతీయులను పంపించడం చాలా విధాలుగా తప్పని మోదీకి నొక్కిచెప్పారు. పలస్తీనాకు భారత్ ఎల్లప్పుడు అండగా నిలస్తుందని, దేశ సంప్రదాయానికి తూట్లు పొడిచేలా వ్యవహరించవద్దని హితవు పలికారు. 'నెలకుపైగా గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 10వేల మందికిపైగా పలస్తీనియన్లు, 1400మంది ఇజ్రాయిలీలు మృతి చెందారు. భారతీయ కార్మికులను యుద్ధ జోన్‌లోకి పంపితే కేంద్ర ప్రభుత్వానికి దేశ పౌరుల భద్రతా, శ్రేయస్సుపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నట్లు కనిపిస్తుంది. ప్రభుత్వ తీరుపై అనేక ప్రశ్నలు వస్తాయి. మీ పాలనలో ఎదుర్కొంటున్న పేదరికాన్ని, నిరుద్యోగాన్ని తప్పించుకునేందుకు తక్కువ జీతాలకు పనిచేసే కార్మికులు విదేశాలకు వెళతారు. వారి నిస్సహాయతను అదునుగా చేసుకొని భీకర యుద్ధం జరుగుతున్న దేశానికి పంపడం సిగ్గుచేటు' అని విశ్వం పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పలస్తీనాకు మద్దతివ్వడం భారతదేశ సంప్రదాయమని, దీనికి తూట్లు పొడిచేలా వ్యవహరించడం తగదని వెల్లడించారు. అంతర్జాతీయ చట్టాలను ధిక్కరిస్తూ, కాల్పుల విరమణకు ఐరాస పదేపదే చేసిన విజ్ఞప్తులను పట్టించుకోకుండా ఇజ్రాయిల్ ఓ యుద్ధం యంత్రంలా మారి గాజాలో రక్తపాతాన్ని సృష్టిస్తోందన్నారు. పలస్తీనా ప్రజలపై అమానవీయంగా సాగిస్తున్న దాడులకు మద్దతిచ్చేలా భారతీయ కార్మికులను అక్కడకు పంపడం ద్వారా గ్లోబల్ సౌత్‌లో దేశ ప్రతిష్ఠ మంటగలుస్తుందని వినయ్ విశ్వం హెచ్చరించారు. పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లజేయొద్దని, యుద్ధ క్షేత్రంలోకి వారిని పంపవద్దని, పలస్తీనా పక్షాన్న నిలిచే భారతదేశ సంప్రదాయానికి తూట్లు పొడవద్దని లేఖలో ప్రధానిని వినయ్ విశ్వం కోరారు.

8 మంది భారతీయులకు మరణశిక్ష కేసు

ఖతార్‌లో భారత్ అప్పీలు

న్యూదిల్లీ:

గత కొన్ని నెలలుగా ఖతార్ నిర్బంధంలో ఉన్న భారత్‌కు చెందిన ఎనిమిది మంది నౌకాదళ మాజీ అధికారులకు అక్కడి కోర్టు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. గూఢచర్యం ఆరోపణలపై వీరికి ఈ శిక్ష పడింది. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే ఖతర్‌లో అప్పీలు దాఖలు చేసినట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. అయితే, ఈ కేసుకు సంబంధించిన వివరాలు మాత్రం అందుబాటులో లేవనీ, తీర్పు గోప్యత దృష్ట్యా దాన్ని కేవలం న్యాయ బృందంతోనే పంచుకునే వీలుందని పేర్కొంది. తదుపరి చట్టపరమైన మార్గాలపై దృష్టి సారించినట్లు తెలిపింది. 'నిర్బంధంలో ఉన్న నౌకాదళ మాజీ అధికారులతో దోహాలోని భారత రాయబార కార్యాలయానికి ఈ మంగళవారం మరోసారి సంప్రదించే అవకాశం లభించింది. వారికి అవసరమైన న్యాయపర, దౌత్యపరమైన పూర్తి సహకారాన్ని అందజేస్తాం. ఇప్పటికే ఈ కేసులో అప్పీలు దాఖలు చేశాం. బాధితుల కుటుంబీకులతో ప్రభుత్వం తరఫున ఇక్కడ సంప్రదింపులు జరుపుతున్నాం. వారితో విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ కూడా ఇటీవలే దిల్లీలో భేటీ అయ్యారు ' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి వెల్లడించారు.

గూఢచర్యానికి పాల్పడుతున్నారన్న అభియోగాలపై ప్రైవేటు భద్రతా సంస్థ అల్ దహ్రాలో పనిచేస్తున్న ఎనిమిది మంది భారత నౌకాదళ మాజీ అధికారులను గతేడాది ఆగస్టులో ఖతార్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై మోపిన అభియోగాలేమిటన్న విషయం బహిర్గతం కాలేదు. ఈ క్రమంలోనే ఎనిమిది మంది భారతీయులకు అక్కడి న్యాయస్థానం అక్టోబర్ చివరి వారంలో మరణశిక్ష విధించింది. దీనిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన భారత ప్రభుత్వం.. అత్యంత ప్రాముఖ్యత గల ఈ కేసుపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించింది.

యూజీ, పీజీ ఆన్‌లైన్ ప్రవేశాలు రద్దు చేయాలి

జాన్సన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ:

యూజీ, పీజీ ఆన్‌లైన్ ప్రవేశాల వల్ల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఉన్నత చదువులకు పెద్దపీట వేస్తానన్న జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేస్తున్నారని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్‌లో పెట్టడం ద్వారా మూడేళ్లుగా ప్రవేశాలు తగ్గిపోయాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కన్వీనర్ కోటాలో 3,74,397 సీట్లు ఉన్నాయని, ఈ విద్యా సంవత్సరం 1,55,358 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని తెలిపారు. 40శాతం సీట్లు కూడా భర్తీ కాలేదన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష వల్ల పీజీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. గతంలో పీజీ విద్యార్థులు ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ సెట్ రాసుకునేవారన్నారు. ప్రస్తుతం ప్రైవేటు యూనివర్సిటీలో పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయడంతో చాలామంది చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పీజీ ప్రవేశాలు కన్వీనర్ కోటాలో 33,836 సీట్లు ఉండగా, 9,848 మంది మాత్రమే చేరారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యా శాఖ తక్షణమే పీజీ ప్రవేశాలకు ఉన్న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేయాలన్నారు. జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని జాన్సన్ బాబు హెచ్చరించారు.

కాంగ్రెస్‌ను అడ్డుకోవడానికి

రంగంలోకి ఈడీ, సీబీఐ, ఐటీ

బీజేపీ, మోదీపై ఖడ్గే విమర్శ

బైకుంత్‌పూర్:

నరేంద్రమోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగిస్తోందని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బైకుంత్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మల్లికార్జున ఖడ్గే గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఖడ్గే ఆరోపించారు. తమను అడ్డుకున్నప్పటికీ ఛత్తీస్‌గఢ్ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం అనివార్యమని స్పష్టంచేశారు. మిజోరం, ఛత్తీస్‌గఢ్ మొదటి దశ పోలింగ్ మంగళవారం పూర్తయింది. ఛత్తీస్‌గఢ్‌లో రెండో విడత, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ ఎన్నికలు నెలాఖరుకు పూర్తవుతాయి. ఖడ్గే మాట్లాడుతూ పేదల కోసం కాంగ్రెస్ పోరాడుతుంటే...బీజేపీ మాత్రం అదానీ వంటి సంపన్నుల కోసం ఆరాటపడుతోందని విమర్శించారు. 'ఈ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను మార్చబోతున్నాయి. రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి, మోదీకి, ఆర్ఎస్ఎస్‌కు ఈ ఎన్నికలు చాలా ముఖ్యం. రాజ్యాంగంలో పేదలు, అణగారిన వర్గాల ప్రయోజనాలకు సంబంధించిన అధికరణలు మార్చడానికి కుట్ర చేస్తున్నాయి' అని మండిపడ్డారు. బీజేపీ కుట్రలకు అడ్డుకట్ట వేయడానికిగాను కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడం చారిత్రక అవసరమని వక్కాణించారు. 'నేను చాలా చేశానని మోదీ చెప్పుకుంటున్నారు. దేశానికి కాంగ్రెస్ ఏమి చేసిందని ప్రశ్నిస్తున్నారు. ప్రతి ప్రసంగంలోనూ కాంగ్రెస్ పేరును మోదీ 50 సార్లు ప్రస్తావిస్తున్నారు. ఎందుకంటే మోదీకి కాంగ్రెస్ అంటే భయం పట్టుకుంది' అని ఖడ్గే అన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికిగాను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా ఈడీ, సీబీఐ, ఐటీలను మోదీ సర్కారు ప్రయోగిస్తోందని ఆరోపించారు. అయినా తాము భయపడేదీ లేదని స్పష్టంచేశారు. భూపేశ్ బాఘెల్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని దీమాగా చెప్పారు. గతంలో మాదిరిగా తాము ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరతామని ప్రజలకు స్పష్టంచేశారు. హైదరాబాద్‌లో ఒక నియోజకవర్గం నుంచి తమ అభ్యర్థి ఒక్కరే పోటీ చేస్తుంటే బీజేపీ మాత్రం ముగ్గురిని బరిలో దింపిందని ఎద్దేవా చేశారు. ఆ ముగ్గురు ఎవరంటే...ఈడీ, ఐటీ. సీబీఐ అని ఖడ్గే తెలిపారు. కులం, మతం పేరుతో బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు.

ముగ్గురు సుప్రీం జడ్జీల ప్రమాణం

న్యూదిల్లీ:

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా మూడు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జి మెసయ, జస్టిస్ సందీప్ మెహతా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆ ముగ్గురితో ప్రమాణం చేయించారు. ఇతర జడ్జీలు, న్యాయవాదులు, కుటుంబ సభ్యుల సమక్షంలో సుప్రీంకోర్టు కాంప్లెక్స్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముగ్గురు జడ్జీల ప్రమాణ స్వీకారంతో 34 మందితో సుప్రీంకోర్టు పూర్తిస్థాయి బలంతో పనిచేయడానికి అవకాశం కుదిరింది. కాగా, నేటి ఉదయమే దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సతీశ్‌చంద్ర శర్మ, రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అగస్టీన్ జార్జి మెసయ, గువహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సందీప్ మెహతాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించారు. ఆ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం నవంబరు 6న సిఫార్సు చేసింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఎక్స్ వేదికగా ఈ నియామకాలను ప్రకటించారు.

అమెరికా-ఇజ్రాయిల్‌కు కేంద్రం వత్తాసు

- మారణహోమాన్ని యూదులు, ముస్లింలకు మధ్య పోరుగా చిత్రీకరించే యత్నం
- కోల్‌కతాలో పలస్తీనా సంఘీభావ ర్యాలీలో వామపక్షాలు
- బ్లింకెన్ భారత్ పర్యటనకు నిరసనగా నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

కోల్‌కతా:

పలస్తీనాలో తక్షణమే హింసకు ముగింపు పలకాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఇజ్రాయిల్ మారణ హోమాన్ని ఆపేందుకు, కాల్పుల విరమణ అమలునకు అమెరికా చర్యలు చేపట్టాలని, అన్ని రకాల సహాయ సహకారాలను నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. పలస్తీనాకు మద్దతుగా బెంగాల్‌లో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించాయి. కోల్‌కతా ర్యాలీ ద్వారా పలస్తీనా ప్రజలకు సంపూర్ణ సంఘీభావాన్ని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్పీ, ఏఐఎఫ్‌బీ, ఎంఎఫ్‌బీతో పాటు వర్కర్ల పార్టీలు ప్రకటించాయి. పలస్తీనాలో అమెరికా- ఇజ్రాయిల్ చర్యలకు మద్దతిచ్చేలా కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఖరి ఉందని ఉమ్మడి ప్రకటనలో దుయ్యబట్టాయి. అమెరికా-ఇజ్రాయిలీ మారణ హోమానికి వత్తాసు పలుకుతోందని విమర్శించాయి. భారత ప్రభుత్వానిది ఎవరి పక్షమని నిలదీశాయి. పలస్తీనా విమోచన పోరాటంలో భారత్ భాగస్వామి అని మరువద్దని సీపీఐ, సీపీఎంతో పాటు వామపక్షాల నేతలు హితవు పలికారు. పలస్తీనాకు మద్దతుగా కోల్‌కతాలోని మహాజాతి సదన్ నుంచి రామిలా పార్కు వరకు వేలాది మంది కదం తొక్కారు. గాజాలో దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. తొలుత వామపక్ష సంఘటన చైర్మన్ బిమన్ బోస్ మాట్లాడుతూ 'నేడు యావత్ ప్రపంచం నిరసన తెలుపు తోంది. పశ్చిమ దేశాల్లోనూ పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయి. పలస్తీనా విమోచన పోరాటంలో మనం భాగస్వాములం. కోల్‌కతాలో సామ్రాజ్యవాద వ్యతిరేక సంప్రదాయం ఉంది' అని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం మాట్లాడుతూ 'ఐక్యరాజ్య సమితిలో శాంతి ప్రతిపాదనపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. యూదులు, ముస్లింల మధ్య యుద్ధంగా ఈ మారణహోమాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రచారం చేస్తున్నాయి. ఈ దురాక్రమణను ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూదులు అనేకమంది వ్యతిరేకిస్తున్నారు' అని తెలిపారు. పలస్తీనాలకు మద్దతుగా నగరంలో అనేక సంఘాలు ర్యాలీలు నిర్వ హించగా అధికార తృణమూల్ కాంగ్రెస్ ఈ వ్యవహారంలో మౌనం వహించడాన్ని నాయకులు ప్రశ్నించారు. ఇదిలా వుంటే అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, రక్షణ కార్యదర్శి ఆస్టిన్ భారత్ పర్యటనకు నిరసనగా వామపక్ష పార్టీలు, మద్దతుదారులు శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నాలు జరగనున్నట్లు నాయకులు వెల్లడించారు.

ఆరువేల పేజీల సమాధానమిచ్చా

ఈడీ విచారణపై అభిషేక్ బెనర్జీ

కోల్‌కతా:

బెంగాల్ స్కూళ్లలో ఉద్యోగాల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ గురువారం హాజరయ్యారు. ఆయన ఉదయం 11.10 గంటలకు ఈడీ అధికారుల ఎదుట హాజరు కాగా మూడు, నాలుగు గంటల పాటు దర్యాప్తు జరిగింది. అనంతరం ఈడీ కార్యాలయం బయట విలేకరులతో అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ విచారణకు పూర్తిగా సహకరించినట్లు తెలిపారు. దాచేందుకు తన వద్ద ఏమీ లేదని చెప్పారు. మొత్తం ఆరు వేల పేజీల సమాధానాన్ని సమర్పించినట్లు తెలిపారు. 'నేను ఈడీ విచారణకు పూర్తిగా సహకరిస్తాను. దాచేందుకు ఏమీ లేదు. మళ్లీ పిలిచినా వెళతాను. అడిగిన వాటిని జావాబిచ్చాను. అవసరమైన పత్రాలన్నింటితో వివరణ ఇచ్చాను' అని అన్నారు.

కీలక పోరులో అదరగొట్టిన కివీస్

- లంకపై ఘన విజయం
- సెమీస్‌లో టీమిండియాతో తలపడే అవకాశం

బెంగళూరు:

వన్డే క్రికెట్ ప్రపంచకప్‌లో కీలక సమయంలో న్యూజిలాండ్ జట్టు మళ్లీ జూలు విదిల్చింది. టోర్నీ ఆరంభంలో వరుసగా నాలుగు విజయాలు సాధించి ఆ తర్వాత నాలుగు మ్యాచుల్లో పరాజయం పాలైన ఆ జట్టు సెమీస్‌కు చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో అదరగొట్టింది. బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియం వేదికగా గురువారం శ్రీలంకతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో కివీస్ ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శ్రీలంక విధించిన 172 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కివీస్ ఐదు వికెట్లు కోల్పోయి 23.2 ఓవర్లలోనే అందుకుంది. ఓపెనర్లు దేవాన్ కాన్వే (45 పరుగులు 42 బంతుల్లో 9 ఫోర్లు), రచిన్ రవీంద్ర (42 పరుగులు 34 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందించారు. ఆ తర్వాత కేన్ విలియమ్సన్ (14), మార్క్ చాప్‌మన్ (7) నిరాశపరిచినా ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ (43 పరుగులు, 31 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో లంకకు మరో ఓటమి తప్పలేదు. లక్ష్య ఛేదనలో గ్లెన్ ఫిలిప్స్ (17), టామ్ లేథమ్ (2) నాటౌట్‌గా నిలిచారు. శ్రీలంక బౌలర్లలో ఏంజెలో మాథ్యూస్ 2 వికెట్లు, మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర తలా ఒక వికెట్ పడగొట్టారు. మూడు కీలక వికెట్లు తీసి న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించిన ట్రెంట్ బౌల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం లభించింది. కాగా ఈ మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన న్యూజిలాండ్ సెమీస్ బెర్తును దాదాపు ఖరారు చేసుకుంది. లంకపై విజయంతో కివీస్ నెట్ రన్‌రేట్ (0.922) మరింత మెరుగుపడింది. పాకిస్తాన్, ఆఫ్ఘాన్ సెమీస్ రేసులో ఆ జట్లు తమ తదుపరి మ్యాచుల్లో భారీ విజయాలు సాధించాల్సి ఉంది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి 46.4 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. టాప్ ఆర్డర్‌లో ఓపెనర్ కుశాల్ పెరీరా (51 పరుగులు 28 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణించాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలతో విరుచుకుపడిన పెరీరా కేవలం 22 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే మిగతా ఆటగాళ్లు పాథుమ్ నిశాంక (2), కుశాల్ మెండిస్ (6), సదీరా సమరవిక్రమ (1), చరిత్ అసలంక (8), ఏంజెలో మాథ్యూస్ (16), ధనంజయ డిసిల్వా (19), కరుణరత్నె (6), దుష్మంత చమీరా (1) వరుసగా పెవిలియన్ బాట పట్టారు. న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి ఒకానొక దశలో 128 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయింది లంక. అయితే మహీశ్ తీక్షణ (39), దిల్షాన్ మదుశంక (19) కాసిన్ని పరుగులు చేయడంతో గౌరవప్రదమైన స్కోరు సాధించింది. కివీస్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ మూడు వికెట్ల తీయగా, ఫెర్గూసన్ 2, మిచెల్ శాంట్నర్ 2, రచిన్ రవీంద్ర 2, టిమ్ సౌథీ ఒక వికెట్ పడగొట్టారు.

వైసీపీవి 'ఫేక్' ఎత్తుగడలు

చంద్రబాబు పేరుతో నకిలీ ఉత్తరం విడుదలపై లోకేశ్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

కుల, మత, ప్రాంత విద్వేషాలు రెచ్చగొడుతూ పైశాచిక ఆనందం పొందే సైకో జగన్ కిరాయి మనుషులు టీడీపీ అధినేత చంద్రబాబు పేరుతో తెలంగాణ ఎన్నికలకు సంబంధించి ఒక నకిలీ ఉత్తరం వదిలారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన గురువారం ట్వీట్ చేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన వైసీపీ ఫేక్ ఎత్తుగడలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక్క యూనిట్ కూడా వాడని ఇంటికి రూ.295 విద్యుత్ బిల్లు వేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని లోకేశ్ విమర్శించారు. సొంత పేపర్, ఛానెల్, సిమెంట్, విద్యుత్ కంపెనీలు, ఊరికో ప్యాలెస్ ఉన్న అవినీతి అనకొండ, పెత్తందారుడు జగన్ అని దుయ్యబట్టారు. పేదలకు రూపాయి స్కీమ్ ఇచ్చి వెయ్యి రూపాయలు దోచే స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. జనాన్ని క్యాన్సర్ గడ్డలా జగన్ పట్టి పీడిస్తున్నారని మండిపడ్డారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.